మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శనివారం 24 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 322

**Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District**



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

**8500066609**




## ఏపీలో నామినేషన్ల వేళ హింసాత్మక ఘటనలు!

- 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల ఘటనలు
- 22 చోట్ల హింస.. మరో 9 చోట్ల నామినేషన్ పత్రాల చించివేత
- నాలుగు వాహనాలకు నిప్పు.. జేసీబీతో ఇంటి కూల్చివేత
- పోలీసు వాహనంపై రాళ్లదాడి.. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- 16 కేసులు నమోదు.. 54 మంది నిందితుల గుర్తింపు
- అనంతపురం జిల్లాలో అత్యధికంగా ఎనిమిది ఘటనలు
- సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాల మోహరింపు
- పార్టీలతో సంబంధం లేకుండా కఠిన చర్యలు: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

మంగళగిరి, ఏపీ బ్యూరో,

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పలుచోట్ల హింసాత్మకంగా మారింది. నామినేషన్ల దాఖలును అడ్డుకోవడం, అభ్యర్థులపై దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపాయి. గురువారం ఒక్కరోజే 13 జిల్లాల్లో 31 ఘటనలు చోటుచేసుకున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. వీటిలో 22 హింసాత్మక ఘర్షణలు కాగా, మరో తొమ్మిది ఘటనలు నామినేషన్ పత్రాలను చించివేయడం, లాక్కోవడం వంటి వాటికి సంబంధించినవని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యధికంగా అనంతపురం జిల్లాలో ఎనిమిది ఘటనలు నమోదయ్యాయి. అన్నమయ్య,

-మిగతా 3 లో

# కూటమిలో సీట్ల సర్దుబాట్లు

**చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ ప్రత్యేక భేటీ**

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తోనూ సీఎం చర్చలు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ సీట్ల పంపకాలపై కసరత్తు
- గ్రామీణ స్థానిక ఎన్నికల్లో వాటాలపై ఉత్కంఠ
- మిత్రపక్షాల మధ్య సమన్వయమే కీలకం
- సీట్ల సర్దుబాటులో స్థానిక బలాబలాలకు ప్రాధాన్యం
- రెబల్ అభ్యర్థుల బెడదపై కూటమి దృష్టి
- అసంతృప్తుల బుజ్జగింపుపై నాయకత్వం కసరత్తు
- అగ్రనేతల భేటీలతో సీట్ల పంపకాలపై ఆసక్తి

సీఎంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. పలుచోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సీఎం నివాసానికి పవన్ చేరుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంట పాటు వీరిద్దరూ చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీలోని ఆశావాహులు తమకు అవకాశం ఉన్న చోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఏకాభిప్రాయం సాధించే అంశంపై చంద్రబాబు, పవన్ చర్చించారు.

03






## భారత్-చైనా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు

- ఎల్‌ఏసీ వెంబడి చైనా సైనికుల కదలికలపై ఆందోళన
- పెట్రోలింగ్ విధానాలను మార్చుకుంటున్న చైనా బలగాలు
- అరుణాచల్‌లో పలుచోట్ల ఎదురెదురుగా ఇరు దేశాల సైనికులు
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న విదేశాంగ శాఖ
- సమస్యల పరిష్కారానికి దౌత్య, సైనిక చర్చలు
- చైనా బలగాలను ఎదుర్కొనేందుకు రంగంలోకి శౌర్య కమాండోలు
- సరిహద్దు భద్రతకు డ్రోన్లు, ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్ కీలక వ్యాఖ్యలు




## అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరు!

- జైలులో ఉన్నా.. బయట ఉన్నా పోరాటం కొనసాగుతుంది
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టీకరణ
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు హాజరైన ఇద్దరు నేతలు
- జంతర్‌మంతర్ ఆందోళనపై మరో కేసులో పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని వ్యాఖ్యలు

## పాక్ సైనికులకు అంత్యక్రియలు చేసింది మేమే!

- కార్గిల్ యుద్ధాన్ని గుర్తుచేస్తూ పాక్‌పై భారత్ ధ్వజం
- సొంత సైనికుల మృతదేహాలనే స్వీకరించని పాకిస్థాన్
- ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు చేసిన భారత సైన్యం
- మత విశ్వాసాల గురించి మాట్లాడే అర్హత మీకెక్కడిది?
- ఉగ్రవాద బాధితుల హక్కులను విస్మరిస్తున్నారంటూ అభ్యంతరం
- కశ్మీర్‌లో రహస్య ఖననాలపై ఐరాస నివేదికలో ప్రస్తావన
- నివేదికలోని ఆరోపణలపై స్పందించిన భారత ప్రతినిధి
- ఐరాస వేదికగా పాక్ వైఖరిని ఎండగట్టిన భారత్



ఐరాస

మత స్వేచ్ఛ, విశ్వాసాలు, అంత్యక్రియల హక్కుల గురించి మాట్లాడుతున్న పాకిస్థాన్‌పై ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 1999 కార్గిల్ యుద్ధంలో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని పాకిస్థాన్‌కు మత సంప్రదాయాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించింది. ఆనాడు పాక్ సైనికుల మృతదేహాలను భారత సైన్యమే స్వాధీనం చేసుకుని, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందని గుర్తుచేసింది.

-మిగతా 3 లో

## రాహుల్ గాంధీ వర్సెస్ ప్రియాంకా గాంధీ?

- కాంగ్రెస్‌లో విబేధాలున్నాయంటున్న బీజేపీ
- రైహాన్ చిత్ర ప్రదర్శనలో 74 ఫొటోల తొలగింపుతో వివాదం
- అప్రకటిత సెన్సార్‌షిప్ అంటూ కాంగ్రెస్ ఆగ్రహం
- మేనల్లుడి వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన బీజేపీ
- విభేదాల ప్రచారాన్ని ఖండించిన కాంగ్రెస్




## ఏఐతో మానవాళి మనుగడకు ముప్పు!

- పదేళ్లలో వినాశనానికి 33 శాతం అవకాశమంటూ హెచ్చరిక
- గూగుల్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ సంచలన వ్యాఖ్యలు
- మానవ నియంత్రణ దాటితే తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన
- భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్న టెక్ కంపెనీలపై విమర్శలు






## అక్టోబర్ 31లోగా కరువు మండలాల ప్రకటన!

- రాష్ట్రంలో 358 మండలాల్లో కరువు పరిస్థితులు
- ఎల్‌నినో ప్రభావంపై కేబినెట్ ఉపసంఘం సమీక్ష
- త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయం
- తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
- 324 మండలాల్లో ఆందోళనకరంగా భూగర్భ జలమట్టాలు
- జలాశయాల్లో 470 టీఎంసీలకు 170 టీఎంసీలే నిల్వ
- కరువు నివారణ పనులకు రూ.7 వేల కోట్ల వ్యయం
- ముందస్తు కార్యాచరణకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు

హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తనున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. అక్టోబర్ 31లోగా కరువు ప్రభావిత మండలాలను ప్రకటించడంతో పాటు పరిస్థితులపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేబినెట్ ఉపసంఘం నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

-మిగతా 3 లో




## కివీస్‌తో రెండో సమరానికి భారత్ సిద్ధం!

- తొలి టీ20 విజయంతో సమరోత్సాహంలో టీమిండియా
- సిరీస్‌లో ఆధిక్యం పెంచుకోవడమే లక్ష్యం
- గాయంతో రెండో మ్యాచ్‌కు ఇషాన్ కిషన్ దూరం
- తుది జట్టులో వైభవ్ సూర్యవంశీకి అవకాశం
- బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులకు కసరత్తు
- తొలి ఓటమికి బదులు తీర్చుకోవాలని కివీస్ పట్టుదల
- క్రైస్ట్‌చర్చ్ వేదికగా ఆసక్తికర పోరు
- మధ్యాహ్నం 12:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు!

**చంద్రబాబు పాలనపై వైసీపీ అధినేత జగన్ ఆగ్రహం**

- రాష్ట్రంలో రావణకాసుర పాలన సాగుతోందని విమర్శ
- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులని ఆరోపణ
- పార్టీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాలనూ పట్టించుకోవడం లేదని ధ్వజం
- 19 మున్సిపాలిటీల్లో నామినేషన్లకు అడ్డంకులని ఆరోపణ
- రీ నామినేషన్లకు పరిమిత అవకాశాలపై అసంతృప్తి
- ఏకపక్ష విజయాల కోసం నిబంధనలు మారుస్తున్నారని విమర్శ




అమరావతి, ఏపీ బ్యూరో,

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, రావణకాసుర పాలన సాగుతోందని ఆరోపించారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో పాటు పోలీస

-మిగతా 3 లో

## ఢిల్లీని కాదు.. చైనాతో సరిహద్దుల్ని కాపాడండి..

- మోదీపై అభిజీత్ దీప్కే విమర్శలు



డ్రీమ్ టైమ్స్

బీజేపీ ప్రభుత్వం కాపాడాల్సింది ఢిల్లీని కాదని.. చైనాతో ఇండియా పంచుకుంటున్న సరిహద్దును అని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే అన్నారు. తాజాగా చైనా సరిహద్దులో భారత జవాన్లతో చైనా సైన్యం ఘర్షణకు దిగుతుండటాన్ని దీప్కే తప్పుబట్టారు. సరిహద్దుల్ని కాపాడటానికి వినియోగించాల్సిన సైన్యాన్ని దేశంలో నిరసనల్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం వాడుతోందని దీప్కే విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు.అరుణాచల్ ప్రదేశ్‌లో, ఇండియా-చైనా సరిహద్దులో నిత్యం ఏదో ఒక చోట ఘర్షణ జరుగుతూనే ఉందని తాజాగా ఐటీబీబీపీ చీఫ్ శత్రుజీత్ కపూర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మన సైన్యానికి, అక్కడ పని చేస్తున్న భారత సైన్యమైన ఐటీబీపీకి మధ్య కొద్ది రోజులుగా నిత్యం ఘర్షణ జరుగుతోందని ఆయన తెలిపారు. ఇక్కడ సరిహద్దు కోసం కేంద్రం కొత్తగా తయారు చేసిన శౌర్య కమాండోలు ధైర్యంగా పని చేస్తున్నట్లు కపూర్ తెలిపారు. ఇప్పుడు ఇదే అంశంపై దీప్కే కేంద్రాన్ని, ప్రధాని మోదీని ప్రశ్నించారు. సైన్యాన్ని వాడుకోవడంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటని దీప్కే నిలదీశారు.దేశ సరిహద్దుల్ని రక్షించాల్సిన సైన్యాన్ని సొంత ప్రజలు నిరసన చేయకుండా వాడటం వల్లే చైనా సరిహద్దులో ఘర్షణ జరుగుతోందన్నారు. సొంత ప్రజల్ని అణచివేసేందుకు మోదీ దేశ భద్రతను పణంగా పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం రక్షించాల్సింది ఢిల్లీని కాదని.. సరిహద్దుల్ని అని దీప్కే సూచించారు. శాంతియుత నిరసనల్ని అడ్డుకోవడం సరికాదన్నారు. మరోవైపు సరిహద్దులో చైనాతో చెలరేగుతున్న ఘర్షణపై కాంగ్రెస్ పార్టీ, శివసేన యూబీటీలు కూడా కేంద్ర ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని విమర్శిస్తున్నాయి.

## అమితాబ్ ఇంటికి బాంబు బెదిరింపు!

- ముంబై మేయర్ కార్యాలయానికీ బెదిరింపు మెయిల్
- అక్టోబర్ 31న పాఠశాలపై దాడి చేస్తామంటూ హెచ్చరిక
- నవంబర్ 27న దిల్జీత్ సంగీత ప్రదర్శన లక్ష్యమని సందేశం
- నగరంలో హైఅలర్ట్ ప్రకటించిన ముంబై పోలీసులు
- బెదిరింపు మెయిల్‌పై ముమ్మర దర్యాప్తు



ముంబై:డ్రీమ్ టైమ్స్

బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసంతో పాటు ముంబై మేయర్ కార్యాలయం, ప్రముఖ గాయకుడు దిల్జీత్ దోసాంజి సంగీత ప్రదర్శనపై దాడులు చేస్తామంటూ వచ్చిన బెదిరింపు మెయిల్ కలకలం రేపింది. ముంబై మేయర్ రీతూ తవాడేకు పంపిన మెయిల్‌లో మేయర్ కార్యాలయం వద్ద బాంబు పేలుడు సంభవిస్తుందని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ సంజయ్ ఘాడీకి కూడా బెదిరింపులు అందాయి. అక్టోబర్ 31న ఓ పాఠశాలపై గ్రెనేడ్ దాడి చేస్తామని, జూహూలోని అమితాబ్ బచ్చన్ నివాసం జల్సాపై అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 మధ్య దాడి చేస్తామని సందేశంలో పేర్కొన్నారు. నవంబర్ 27న మహాలక్ష్మి రేస్‌కోర్సు ప్రాంతంలో జరగనున్న దిల్జీత్ దోసాంజి సంగీత ప్రదర్శనను కూడా లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు నగరంలో అప్రమత్తత ప్రకటించారు. బెదిరింపు సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టాయి. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. మేయర్ కార్యాలయం పరిసరాల్లో భద్రతను పెంచడంతో పాటు బెదిరింపుల్లో ప్రస్తావించిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఖలిస్థానీ పేరుతో ఈ హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం ఉన్నప్పటికీ, వాటిని ఎవరు పంపారనే విషయంపై స్పష్టత రాలేదు. మెయిల్ మూలాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తున్నారు.

## ఇంజినీరు కాకున్నా ఎగిరే కారు తయారు చేశాడు!

ఉత్తరాఖండ్‌వాసి అద్భుతం



అల్మోరా డ్రీమ్ టైమ్స్

ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాకు చెందిన రవి తామ్తా ఎలాంటి ఇంజినీరింగ్ విద్య లేకుండానే సొంతంగా ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కారు(ఎగిరే కారు) ప్రొటోటైప్‌ను విజయవంతంగా తయారు చేశాడు.'హాపిడా స్కై ప్రైవేట్ లిమిటెడ్' ద్వారా 2015 నుంచి ఈ ఆలోచనపై పనిచేస్తూ, ఇంటర్నెట్ సమాచారాన్ని నమ్ముకుని, తన తండ్రి సహకారంతో ఈ ప్రయోగాన్ని సాకారం చేశాడు. 'హాపిడా స్కైనెక్స్' అని పేరు పెట్టిన ఈ వాహనం రన్ వే అవసరం లేకుండా నిలువుగా టేకాఫ్, ల్యాండిగ్ చేయగలదు.

## ప్రేమించండి.. కానీ గర్ల్‌ఫ్రెండ్‌ను
# తల్లిని చేసి వదిలేయొద్దు.

- అబ్బాయిలకు యూపీ గవర్నర్ కీలక సూచన!



డ్రీమ్ టైమ్స్

ప్రేమ, వివాహబంధంపై యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ వ్యాఖ్యలు మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. లక్నోలోని ఓ ప్రైవేటు కళాశాల ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆమె.. ప్రేమ పేరుతో ఓ అమ్మాయితో బంధం ఏర్పరచుకుని, ఆమె తల్లయ్యాక ఒంటరిగా వదిలేయడం సరికాదని అన్నారు. ప్రేమలో ఉండటంలో తప్పు లేదని, అయితే పెళ్లి చేసుకుంటానని మాటిస్తే దాన్ని నిలబెట్టుకోవాలని యువతకు సూచించారు. ప్రేమిస్తే ప్రేమించండి.. కానీ ప్రేమ పేరుతో అమ్మాయిని తల్లిని చేసి మోసం చేయకండి అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి."గర్ల్‌ఫ్రెండ్ ఉండటంలో తప్పు లేదు. కానీ, పెళ్లి చేసుకుంటానని మాటిస్తే ఆ మాటను నిలబెట్టుకోవాలి" అని ఆనందీబెన్ పటేల్ స్పష్టం చేశారు. చిన్న వయసులోనే బాలికలు తల్లులవడం, ఆ తర్వాత వారి భాగస్వాములు వారిని విడిచిపెట్టడం ఆందోళనకరమని అన్నారు. "13-14 ఏళ్ల వయసులో ఓ అమ్మాయిని తల్లిని చేసి, ఆ తర్వాత ఆమెను ఒంటరిగా వదిలేయడం సరికాదు" అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. అయితే ప్రభుత్వ చర్యలతోపాటు సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలని సూచించారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధానికి మాత్రమే పరిమితం కాదని గవర్నర్ అన్నారు. దాంతో పాటు కుటుంబ బాధ్యతలు కూడా వస్తాయని గుర్తుచేశారు. యువత ముందుగా ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగాలని, కుటుంబాన్ని పోషించే స్థాయికి చేరుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించాలని సూచించారు. భవిష్యత్తులో కలిసి జీవించాలనే హామీలు ఇచ్చే ముందు వాటి పరిణామాలను అర్థం చేసుకోవాలని, భావోద్వేగాలతో నిర్ణయాలు తీసుకోకుండా ఆచితూచి వ్యవహరించాలని హితవు పలికారు. ఆనందీబెన్ పటేల్ గతంలోనూ సంబంధాలు, కుటుంబ విలువలపై చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. అమ్మాయిలు కెరీర్ కంటే ముందు మంచి తల్లిగా మారాలని గతంలో ఆమె చేసిన సూచనలు వివాదాస్పదమయ్యాయి. అలాగే 2025 అక్టోబరులో బల్లియా, వారణాసిలో జరిగిన విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో మాట్లాడుతూ.. యువతులు సహజీవన సంబంధాల్లోకి వెళ్లే ముందు వాటి పరిణామాలను ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

# యూపీలో పొత్తుకు సీట్ల పీటముడి!

- సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుకు కాంగ్రెస్ ప్రయత్నాలు
- 403 స్థానాల్లో 200 సీట్లు కావాలంటూ ప్రతిపాదన
- గతంలో 50 సీట్లకే అంగీకరించిన ఎస్పీ
- సీట్ల సర్దుబాటుపై ప్రియాంకాగాంధీ సమాలోచనలు
- కాంగ్రెస్ డిమాండ్‌పై అఖిలేశ్ నిర్ణయంపై ఉత్కంఠ



లక్నో:డ్రీమ్ టైమ్స్

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రతిపక్ష పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశం చర్చనీయాంశంగా మారింది. అధికార బీజేపీని ఎదుర్కొనేందుకు సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు కొనసాగించాలని భావిస్తున్న కాంగ్రెస్ ఏకంగా 200 అసెంబ్లీ స్థానాలను కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉండగా, దాదాపు సగం సీట్లను తమకు కేటాయించాలని కాంగ్రెస్ ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఈ డిమాండ్‌పై ఇరు పార్టీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. గతంలో కాంగ్రెస్‌కు 50 స్థానాలు కేటాయించేందుకు సమాజ్‌వాదీ పార్టీ సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అప్పట్లో కాంగ్రెస్ 150 సీట్లు కోరగా, ఎస్పీ అందుకు అంగీకరించలేదని సమాచారం. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ గతంలో తమ పార్టీ 350 స్థానాల్లో, కాంగ్రెస్ 53 స్థానాల్లో పోటీ చేసే ప్రతిపాదనను ప్రస్తావించారు. తాజాగా కాంగ్రెస్ డిమాండ్ 200 సీట్లకు పెరిగినట్లు ప్రచారం జరుగుతుండటంతో సీట్ల సర్దుబాటు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ ఉత్తరప్రదేశ్ పార్టీ నాయకులతో సమావేశమై ఎన్నికల సన్నాహాలు, పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తాజా ప్రతిపాదనపై అఖిలేశ్ యాదవ్ ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల మధ్య పొత్తు చర్చలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తాజా అక్టోబర్ 23 కథనాల ప్రకారం కాంగ్రెస్ 170 నుంచి 180 స్థానాల జాబితాను చర్చలకు అందించినట్లు సమాచారం. 200 సీట్ల డిమాండ్‌పై వార్తలు వచ్చినప్పటికీ, ఆ సంఖ్యలను అఖిలేశ్ యాదవ్ ధ్రువీకరించలేదు. సీట్ల పంపకంపై తుది ఒప్పందం ఇంకా కుదరలేదు

## ఢిల్లీలో మళ్లీ భగ్గుమన్న
# 'సర్' వ్యతిరేక ఆందోళనలు!

- ఓట్ల తొలగింపును నిరసిస్తూ ఈసీ కార్యాలయానికి ర్యాలీ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- ర్యాలీని అడ్డుకుని పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రైతులు, విద్యార్థులు, పౌర సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- ఢిల్లీలో అదనంగా 273 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు



న్యూఢిల్లీ:డ్రీమ్ టైమ్స్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి ఆందోళనలు మొదలయ్యాయి. సర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం రైతులు, విద్యార్థులు, పౌర సంఘాల ప్రతినిధులు నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ర్యాలీని అడ్డుకుని పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి పటేల్ చౌక్ సమీపంలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని ఆందోళనకారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేతో పాటు పలువురు నాయకులను నిర్వాహకులు ఆహ్వానించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓట్ల తొలగింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'హర్ గలీ జంతర్‌మంతర్.. హర్ గావ్ జంతర్‌మంతర్.. మేరా ఘర్ జంతర్‌మంతర్' అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ ముందుకు సాగకుండా పోలీసులు, భద్రతా బలగాలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇప్పటికే భారీ సంఖ్యలో పోలీసులను మోహరించగా, అదనంగా 273 కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) కంపెనీలను రంగంలోకి దించినట్లు సమాచారం. తొలుత అక్టోబర్ 20 వరకు మాత్రమే ఈ బలగాలను కొనసాగించాలని భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నెలాఖరు వరకు మోహరింపును పొడిగించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, కీలక ప్రాంతాల్లో భద్రతను పెంచారు. నిరసనలు మరింత విస్తరించకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

## స్టార్‌లింక్ సేవలపై ఇంకా ఆంక్షలు కొనసాగుతున్నాయి: ఉక్రెయిన్



కీవ్: డ్రీమ్ టైమ్స్

స్టార్‌లింక్ నెట్వర్క్ తో ఇంకా సమస్యలు వస్తూనే ఉన్నాయని ఉక్రెయిన్ చెబుతోంది. ఆ దేశ రక్షణ శాఖ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నది. ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ అప్‌లింక్ ఆంక్షలు ఎత్తివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినా.. ఉక్రెయిన్‌లో మాత్రం స్టార్‌లింక్ సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే డ్రోన్లకు కనెక్షన్ లాస్ ఎదురవుతున్నట్లు చెబుతున్నారు. దీంతో మిలిటరీ ఆపరేషన్స్ అవరోధాలకు గురవుతున్నాయి.రష్యాతో యుద్ధం వేళ స్టార్‌లింక్ శాటిలైట్ సంబంధాలు కీలకంగా మారాయి. స్టార్‌లింక్‌కు చెందిన మిలిటరీ గ్రేడ్ శాటిలైట్ స్టార్‌షీల్డ్ .. ఉక్రెయిన్‌కు సేవలు అందించరాదు అని టెక్ బిలియనీర్‌కు ఆదేశాలు ఇవ్వలేదని ఇటీవల ట్రంప్ చెప్పారు. స్టార్‌షీల్డ్ మళ్లీ సేవల్ని అందిస్తున్నట్లు మస్క్ కూడా వెల్లడించారు. స్టార్‌లింక్ కానీ స్టార్‌షీల్డ్ పనితీరు నెమ్మదించడానికి తనకు ఎటువంటి సంబంధం లేదని మస్క్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. స్టార్‌లింక్ లేదా స్టార్‌షీల్డ్ సేవల్లో అంతరాయం వల్ల ఉక్రెయిన్ తన డ్రోన్ సామర్థ్యాన్ని సరిగా వినియోగించుకోలేకపోయింది. శాటిలైట్ కనెక్షన్ స్పీడ్ తగ్గడం వల్ల.. అటాక్ డ్రోన్లను వాడడం లేదా డిఫెన్సివ్ ఆపరేషన్స్‌ను సరైన రీతిలో కోఆర్డినేట్ చేయలేకపోతున్నది. స్టార్‌లింక్‌తో పాటు స్టార్‌షీల్డ్ నెట్వర్క్‌లను అనునిత్యం మానిటర్ చేస్తున్నామని ఉక్రెయిన్ రక్షణశాఖ వర్గాలు చెబుతున్నాయి. శాటిలైట్లపై ఉన్న ఆంక్షలను అమెరికా ఎత్తివేసినట్లు తమకు ఎటువంటి అధికారిక సమాచారం లేదని ఉక్రెయిన్ రక్షణశాఖ పేర్కొన్నది. లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్లకు అప్‌లింక్ స్పీడ్‌ను తగ్గించినట్లు కీవ్ ఇటీవల ఆరోపించింది. దీంతో డ్రోన్లు ప్రయాణించే వేగం తగ్గింది. 100 కిలోమీటర్ల కన్నా వేగంగా ప్రయాణించే డ్రోన్లకు సంబంధాలు తెగిపోతున్నట్లు అధికారులు గుర్తించారు. ఉక్రెయిన్ రక్షణ శాఖ తమ ఆపరేషన్స్ కోసం స్టార్‌షీల్డ్‌ను వాడుతోంది. అయితే ఆ శాటిలైట్‌ను అమెరికా మిలిటరీ కంట్రోల్ చేస్తోంది, ప్రస్తుతం వస్తున్న సమస్య వెనుక పెంటగాన్ హస్తం ఉన్నట్లు భావిస్తున్నారు. ఉక్రెయిన్ శాటిలైట్ నెట్వర్క్‌లపై ఆంక్షలు విధిస్తున్నట్లు వస్తున్న వార్తలను శ్వేతసౌధం ఖండించింది.

# పాక్ సైనికులకు అంత్యక్రియలు చేసింది మేమే!

(మొదటి తరువాయి)

ఉగ్రవాదుల హక్కులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నివేదికలో ఉగ్రవాద బాధితుల హక్కులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని భారత్ తప్పుబట్టింది. జమ్మూకశ్మీర్‌లో భద్రతా చర్యల్లో మరణించిన వారి మృతదేహాలను కుటుంబాలకు అప్పగించకుండా మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా ఖననం చేస్తున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని మత స్వేచ్ఛ, విశ్వాసాలపై ఐరాస ప్రత్యేక నివేదికకర్త నజీలా ఘనియా తన మధ్యంతర నివేదికలో పేర్కొన్నారు. ఈ చర్యలు ప్రధానంగా ముస్లింలను ప్రభావితం చేస్తున్నాయని, వారి మత సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నివేదికపై గురువారం జరిగిన చర్చలో ఐరాసలో భారత శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి భావిక మంగళానందన్ స్పందించారు. కార్గిల్ యుద్ధంలో తమ సైనికుల ప్రమేయాన్ని పాకిస్థాన్ అంగీకరించకపోయినా, భారత సైన్యం మానవతా దృక్పథంతో వారి మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిందని తెలిపారు. మత విశ్వాసాలను గౌరవించడంలో భారత్ తన బాధ్యతను నిర్వర్తించిందని స్పష్టం చేశారు. ఉగ్రవాద బాధితుల హక్కులను కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐరాస వేదికగా భారత్ స్పష్టం చేసింది.

# అరెస్టులతో మా ఉద్యమాన్ని ఆపలేరు!

- జైలులో ఉన్నా.. బయట ఉన్నా పోరాటం కొనసాగుతుంది
- సీజేపీ నేతలు సారవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టీకరణ
- ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ విచారణకు హాజరైన ఇద్దరు నేతలు
- జంతర్‌మంతర్ ఆందోళనపై మరో కేసులో పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని వ్యాఖ్యలు




న్యూఢిల్లీ

తమను అరెస్టు చేసినంత మాత్రాన సీజేపీ చేపట్టిన ఉద్యమం ఆగిపోదని ఆ పార్టీ అగ్రనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా స్పష్టం చేశారు. పార్టీ నాయకులు జైలులో ఉన్నా, బయట ఉన్నా ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. అక్టోబర్ 13న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు జారీ చేసిన సమన్ల మేరకు శుక్రవారం ఇద్దరు నేతలు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణచివేయలేరని పేర్కొన్నారు. తాము నాయకులం కాదని, దేశ ప్రజలు తమకు అప్పగించిన వ్యవస్థకు సంరక్షకులం మాత్రమేనని రాంకా, దాస్ వ్యాఖ్యానించారు. తమకు చేతనైనంత మంచి చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. అరెస్టుల కారణంగా వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. నాయకులను అరెస్టు చేస్తే ఉద్యమం ఎలా కొనసాగుతుందని మీడియా ప్రశ్నించగా, వ్యక్తులను నిర్బంధించినా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న సీజేపీ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలతో రాంకా, దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో వారం రోజులకు పైగా తిహార్ జైలులో ఉన్నారు. గత బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేయగా, అదే రోజు మరో కేసులో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఇద్దరూ విచారణకు హాజరయ్యారు. తమపై కేసులు నమోదైనా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

## రాహుల్ గాంధీ వర్సెస్ ప్రియాంకా గాంధీ..

న్యూఢిల్లీ



కాంగ్రెస్ పార్టీలో అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ మధ్య విభేధాలున్నాయా..? బీజేపీ మాత్రం ఇది నిజమే అని ప్రచారం చేస్తోంది. ప్రియాంకా, రాహుల్ మధ్య అంతర్గత విభేధాలు చోటు చేసుకున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఈ అంశంపై కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. ఇటీవల ప్రియాంకా గాంధీ తనయుడు, రాహుల్ గాంధీ మేనల్లుడు రైహాన్ వాద్రా విజువల్ అర్టిస్ట్, ఫొటోగ్రాఫర్ అనే సంగతి తెలిసిందే.అతడి చిత్రాలతో ఢిల్లీలోని బికనీర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అయితే, ఈ ప్రదర్శనలో ఉంచిన 105 చిత్రాలలో 74 ఫోటోలను ఎగ్జిబిషన్ నిర్వాహకులు తొలగించారు. వాటిలో యువత నిరసనలు, రాజకీయ అంశాలకు సంబంధించినవి ఉన్నాయని, అందువల్లే వాటిని తొలగించామని నిర్వాహకులు వివరణ ఇచ్చారు. దీనిపై రైహాన్ తల్లి ప్రియాంక గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇది అప్రకటిత సెన్సార్‌షిప్ అని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ వివాదం రాజకీయ అంశంగా మారింది. ఇంత వివాదం జరిగినా ఈ అంశంపై రాహుల్ గాంధీ ఒక్క ట్వీట్ కూడా వేయలేదు.

## ఏపీలో నామినేషన్ల వేళ హింసాత్మక ఘటనలు!

(మొదటి తరువాయి)

కడప, ప్రకాశం జిల్లాల్లో మూడేసి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పలు ప్రాంతాల్లో రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడగా, రెండు కార్లు, రెండు మోటార్‌సైకిళ్లకు నిప్పు పెట్టారు. ఒకచోట జేసీబీతో ఇంటిని కూల్చివేయడం, మరోచోట గాల్లోకి కాల్పులు జరపడం వంటి ఘటనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దుండగులు రాళ్లదాడికి పాల్పడటంతో కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయమైంది. మరో ఘటనలో అభ్యర్థితో పాటు ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేసి, 54 మంది నిందితులను గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. నిందితుల్లో టీడీపీ, వైసీపీ, సీపీఎం పార్టీలకు చెందిన వారితో పాటు స్వతంత్రులు కూడా ఉన్నారని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న ఘటనలపై వెంటనే కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని సూచించారు. అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. బెదిరింపులు, దాడులు ఎదురైతే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సూచించారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు!

(మొదటి తరువాయి)

స్టేషన్లకు పిలిపించి వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలకు సంబంధించిన ఆధారాలను సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం, గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని ఆదేశించినట్లు జగన్ గుర్తుచేశారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి భద్రత కల్పించాలని, నామినేషన్ కేంద్రాల్లో సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయకుండా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు సృష్టించారని జగన్ ఆరోపించారు. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం కొన్ని ప్రాంతాల్లో పరిమిత సంఖ్యలో మాత్రమే తిరిగి నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏకపక్ష విజయాలు సాధించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుంటోందని విమర్శించారు. ఈ వ్యవహారం మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని, అభ్యర్థుల హక్కులను కాపాడాలని జగన్ డిమాండ్ చేశారు.

# కూటమిలో సీట్ల సర్దుబాట్లు

(మొదటి తరువాయి)



**అమరావతి,**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశం కీలకంగా మారింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక, మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు, రెబల్ అభ్యర్థుల సమస్యలపై కూటమి అగ్రనేతలు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తోనూ చంద్రబాబు చర్చలు జరిపారు. సీఎం నివాసంలో పవన్ కళ్యాణ్ మధ్య సుమారు 40 నిమిషాల పాటు సమావేశం జరిగినట్లు సమాచారం. స్థానిక ఎన్నికల తాజా పరిణామాలు, గ్రామీణ స్థానిక సంస్థల్లో సీట్ల పంపకాలు, పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూడు పార్టీలకు చెందిన పలువురు ఆశావాహులు నామినేషన్లు దాఖలు చేయడంతో అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటు వ్యవహారం నాయకత్వానికి సవాలుగా మారింది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 123 స్థానాల్లో జనసేనకు 24, బీజేపీకి 9 స్థానాలు కేటాయించినట్లు సమాచారం. ఇదే విధానాన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ కొనసాగిస్తారా? లేక గ్రామీణ ప్రాంతాల్లో పార్టీల బలాబలాలు, స్థానిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా సీట్ల కేటాయింపుల్లో మార్పులు చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**సీట్ల వాటాపై చర్చలు**

గ్రామీణ స్థానిక ఎన్నికల్లో 30 శాతం సీట్లు కేటాయించాలని పవన్ కళ్యాణ్ కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. స్థానికంగా పార్టీల బలాబలాలను పరిగణనలోకి తీసుకుని సర్దుబాటు చేసుకుందామని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. పవన్‌తో భేటీ అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో చంద్రబాబు సమావేశం కావడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీకి కేటాయించాల్సిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై చర్చించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**రెబల్ అభ్యర్థులే ప్రధాన సవాలు**

సీట్ల పంపకాలలో అసంతృప్తులు, రెబల్ అభ్యర్థుల పోటీ కూటమి పార్టీలకు సమస్యగా మారే అవకాశముంది. ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన ఆశావాహుల్లో ఎవరికి అవకాశం కల్పించాలి? సీటు దక్కని నేతలను ఎలా సముదాయించాలి? అన్న అంశాలపై పార్టీ నాయకత్వాలు దృష్టి సారించాల్సి ఉంది. నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా అసంతృప్తులను బుజ్జగించి, మిత్రపక్షాల మధ్య సమన్వయం సాధించడంపై కూటమి నేతలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అగ్రనేతల చర్చలతో సీట్ల సర్దుబాటుపై స్పష్టత వస్తుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

# అక్టోబర్ 31లోగా కరువు మండలాల ప్రకటన!

(మొదటి తరువాయి)

అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఉపసంఘం తొలి సమావేశంలో కరువు నివారణ, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు 20 శాతానికి మించి ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, నిబంధనల ప్రకారం సిఫార్సులు సిద్ధం చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. అత్యవసర అవసరాలకు ఆర్థిక శాఖ నిధులు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుత నీటి ఎద్దడి నేపథ్యంలో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి వారం సమీక్షలు నిర్వహించి కరువు నివారణ చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు, వేసవి తీవ్రతకు సంబంధించిన వివరాలను క్రమం తప్పకుండా వెల్లడించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నీటి సంరక్షణ, వ్యవసాయ సలహాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.7 వేల కోట్లతో కరువు నివారణ పనులు చేపడుతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమివ్వాలని, కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులకు అత్యవసర నిధులు అందుబాటులో ఉంచాలని సూచించారు. చెరువుల్లో నీరు తగ్గుతున్న నేపథ్యంలో చేపల సంరక్షణకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశువుల కోసం గ్రామాల్లో నీటితొట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 358 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. తక్కువ వర్షపాతం, సాగు విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండటం వంటి ప్రమాణాల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 31లోగా కరువు మండలాల జాబితాను కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉండగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర జలాశయాల్లో మొత్తం 470 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 170 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. సింగూరు జలాశయంలో నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.కోటి విడుదల చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్-చైనా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు

-చైనా పెట్రోలింగ్ తీరుపై భారత్ ఆందోళన

-అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ముఖాముఖి పరిస్థితులు

-సరిహద్దులో శాంతి తప్పనిసరన్న విదేశాంగ శాఖ



న్యూఢిల్లీ:

భారత్-చైనా సరిహద్దులో మరోసారి ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి చైనా సైనికులు గతంలో అనుసరిస్తున్న పెట్రోలింగ్ విధానాలకు భిన్నంగా వ్యవహరించడం వల్ల అప్పుడప్పుడు పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత నెలకొనడం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొంది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో భారత దళాలకు ఎదురెదురుగా తలపడే పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించిన నేపథ్యంలో కేంద్రం స్పందించింది. చైనా బలగాలు గతంలో ఇరు పక్షాల మధ్య ఉన్న పెట్రోలింగ్ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడు సరిహద్దు పరిస్థితులు ఎప్పటికప్పుడు ప్రభావితమవుతున్నాయని జైస్వాల్ తెలిపారు. ఎల్‌ఏసీ వెంబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, అపార్థాలు మరియు తప్పుడు అంచనాలను నివారించేందుకు ఇరు దేశాలు ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాల ద్వారా చర్చలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. సరిహద్దు నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఎల్‌ఏసీపై పరస్పర అవగాహన పెంచుకునే అంశాలను కూడా భారత్, చైనా చర్చించేందుకు అంగీకరించాయని ఆయన వెల్లడించారు. అయితే, అరుణాచల్ ప్రదేశ్‌లో చోటుచేసుకున్న తాజా ముఖాముఖి ఘటనలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలపై స్పందించకుండా, ఆ అంశాలను రక్షణ మంత్రిత్వ శాఖను అడగాలని సూచించారు.

రంగంలోకి 'శౌర్య' కమాండోలు

మరోవైపు, అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ)తో భారత దళాలకు ఎదురెదురుగా తలపడే పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయని ఐటీబీపీ చీఫ్ శత్రుజీత్ కపూర్ గురువారం వెల్లడించారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఐటీబీపీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ, ఆధునిక సాంకేతికత అవసరమని పేర్కొన్నారు. సరిహద్దు బెటాలియన్లలో డ్రోన్ విభాగాలను ఏర్పాటు చేసినట్లు, గాల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక స్ట్రైక్ శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. చైనా బలగాలతో కొనసాగుతున్న ముఖాముఖి పరిస్థితుల్లో శౌర్య కమాండోలు తమ సామర్థ్యాలను ప్రదర్శించారని కూడా ఆయన పేర్కొన్నారు. 2020లో గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అనంతరం సరిహద్దు సమస్యల పరిష్కారం, సైనిక బలగాల ఉపసంహరణ, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ దిశగా ఇరు దేశాలు పలు చర్చలు చేపట్టాయి. 2024 అక్టోబర్‌లో తూర్పు లద్దాఖ్‌లోని దెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో సైనిక బలగాల ఉపసంహరణకు సంబంధించి ఇరు దేశాలు అవగాహనకు వచ్చాయి. అయినప్పటికీ, సరిహద్దులో అప్పుడప్పుడు తలెత్తుతున్న ఉద్రిక్తతలు ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌ఏసీ వెంబడి శాంతి, ప్రశాంతతను కాపాడుకోవడంతో పాటు దౌత్య, సైనిక చర్చలను కొనసాగించడం అత్యవసరమని భారత్ మరోసారి స్పష్టం చేసింది.

## కివీస్‌తో రెండో సమరానికి భారత్ సిద్ధం!

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ పర్యటనను ఘన విజయంతో ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా శనివారం క్రైస్ట్‌చర్చ్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టీ20 జరగనుంది. తొలి మ్యాచ్‌లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి రికార్డు విజయాన్ని అందుకున్న శ్రేయస్ అయ్యర్ సేన అదే జోరును కొనసాగించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలని ఆతిథ్య న్యూజిలాండ్ భావిస్తోంది. తొలి టీ20లో భారత బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించారు. సంజూ శాంసన్ 67 పరుగులతో శుభారంభం అందించగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 42 పరుగులతో ఆకట్టుకున్నాడు. చివర్లో నమన్ ధీర్ కేవలం 15 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అయితే రెండో టీ20కి ముందు భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తొడ కండరాల గాయంతో మ్యాచ్‌కు దూరమైనట్లు బీసీసీఐ వెల్లడించింది. అతడి స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. వైభవ్ తుది జట్టులోకి వస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది. దీంతో సంజూ శాంసన్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగవచ్చు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మతో పాటు ఆల్‌రౌండర్లు నమన్ ధీర్, అక్షర్ పటేల్‌పైనా జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. తొలి మ్యాచ్‌లో ధాటిగా ఆడిన నమన్ ధీర్ మరోసారి కీలకంగా మారనున్నాడు. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. తొలి మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న బౌలర్లు ఈసారి పుంజుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో లోపాలను సరిదిద్దుకుని బరిలోకి దిగనుంది. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభం కానుంది.

భారత్ అంచనా తుది జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్.

న్యూజిలాండ్ అంచనా తుది జట్టు: ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, జాకబ్స్, బ్రాస్‌వెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, మాట్ హెన్రీ, మిల్నే, లోకీ ఫెర్గ్యూసన్

## ఏఐతో మానవాళి మనుగడకు ముప్పు!

- పదేళ్లలో వినాశనానికి 33 శాతం అవకాశమంటూ హెచ్చరిక
- గూగుల్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ సంచలన వ్యాఖ్యలు
- మానవ నియంత్రణ దాటితే తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన
- భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్న టెక్ కంపెనీలపై విమర్శలు




న్యూఢిల్లీ

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత భవిష్యత్తులో మానవాళి మనుగడకే ముప్పుగా మారే ప్రమాదముందని గూగుల్ డీప్‌మైండ్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ హెచ్చరించారు. రాబోయే పదేళ్లలో ఏఐ కారణంగా మానవాళి అంతమయ్యే అవకాశం 33 శాతం ఉందని ఆయన అంచనా వేశారు. శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ మానవుల ఆదేశాలు లేకుండానే ఏఐ వ్యవస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏఐ అభివృద్ధిపై తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే భద్రతా చర్యలపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో పోటీ కారణంగా ప్రముఖ కంపెనీలు ఏఐ భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని టర్నర్ ఆరోపించారు. ఆధునిక ఏఐ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయో వాటిని రూపొందించిన శాస్త్రవేత్తలు కూడా పూర్తిస్థాయిలో అర్థం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఒక ఏఐ వ్యవస్థను పర్యవేక్షించేందుకు మరో ఏఐని ఉపయోగించడం సరైన భద్రతా చర్య కాదన్నారు. ఏఐ లక్ష్యాలను మానవ ప్రయోజనాలకు అనుగుణంగా నియంత్రించే వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదని చెప్పారు. గతంలో పొగాకు, చమురు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే ప్రమాదాలను దాచినట్లే ప్రస్తుతం కొన్ని ఏఐ కంపెనీలు కూడా ముప్పును తక్కువ చేసి చూపుతున్నాయని టర్నర్ విమర్శించారు. ఏఐ ప్రమాదాలపై హెచ్చరికలను తప్పుదోవ పట్టించే ప్రచారంగా చిత్రీకరిస్తున్నాయని ఆరోపించారు. అమెరికా రక్షణ శాఖతో గూగుల్ ఒప్పందం, సైనిక అవసరాలకు ఏఐ వినియోగంలో భద్రతా ప్రమాణాలపై అభ్యంతరాలతోనే తాను డీప్‌మైండ్ నుంచి బయటకు వచ్చినట్లు వెల్లడించారు. ఏఐ అభివృద్ధితో పాటు మానవ నియంత్రణ, భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# ఎం.రాచపల్లి గ్రామంలో ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు



**ఎం. రాచపల్లి అక్టోబరు 23 (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని మైలపల్లి పంచాయితీ ఎం. రాచపల్లి గ్రామంలో శుక్రవారం ప్రభాస్ అభిమాన సంఘం యువత, మానవత స్వచ్ఛందసేవా సంస్థ చిట్వేలి శాఖల ఆధ్వర్యంలో ప్రభాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శతాధిక రక్త దాత డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ పర్యవేక్షణలో తిరుపతి రెడ్ క్రాస్ సంస్థ వైద్యులు సంధ్యారాణి రక్తం సేకరించారు. ఈ శిబిరంలో 52మంది అభిమానులు రక్తం దానం చేశారు. సమాజ సేవకులు డాక్టర్ చంద్రశేఖర్ రక్తధానం చేయడంతో పాటు దాతలకు మనోధైర్యాన్ని ఇచ్చారు. రక్తదాతలకు ప్రసంశా పత్రాలను అందజేశారు. ఎం.రాచపల్లి గ్రామంలో వచ్చిన ప్రభాస్ అభిమానులకు, స్వచ్ఛంద సంస్థల వారికి ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మానవత ఆధ్వర్యంలో మధ్యాహ్నం చిట్వేలిలో కూడా పేదలకు, యాచకులకు, పారిశుధ్య కార్మికులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత రాఘవరాజు. శివశంకర్ రాజు, యానాదిరాజు, చక్రవర్తుల వరుణ్ కుమార్ రాజు, వెంకటేశ్వర రాజు, చక్రవర్తుల నానీ, చక్రవర్తుల వర్మ, చక్రవర్తుల సుబ్బరాజు, గడ్డం. కార్తిక్, చొక్కారాజు. చంద్రరాజు, నరేష్ రాజు, పాండురాజు. నరేంద్రవర్మ, మానవత బాధ్యులు మునిరావు, సాయిరాం, గ్రామ యువత, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో టీడీపీకి షాక్.

**మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరికలు.**



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో తెలుగుదేశం పార్టీకి షాక్ తగిలింది. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో బొజ్జ ఎల్లారెడ్డి, ఆళ్లగడ్డ రవీంద్రనాథ్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, మంగలి రవీంద్రబాబు, బోయ సురేంద్ర, పబ్బతి రాజన్న తదితరులు తమ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారందరినీ వైసీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడాన్ని పక్కనపెట్టి, టీడీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నంద్యాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో వైసీపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.
పులిమద్ది గ్రామంలో జరిగిన ఈ చేరికలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# నేడు ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన

**- 96 నామినేషన్ పత్రాలపై అధికారులు దృష్టి**
**- ఉదయం 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం**



**చిట్వేలి, అక్టోబరు 24 (డ్రీమ్ టైమ్స్)**
రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్వేలు మండల పరిషత్ ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు స్వీకరించిన మొత్తం 96 నామినేషన్ పత్రాలను శనివారం పరిశీలించనున్నారు. చిట్వేలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉదయం 8 గంటలకు పరిశీలన ప్రక్రియ ప్రారంభమవుతుందని రిటర్నింగ్ అధికారి జి. జయభరత్ రెడ్డి వెల్లడించారు. ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరుకావాలని ఆయన సూచించారు. నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం అభ్యర్థుల అర్హత, పత్రాల వివరాల ఆధారంగా తదుపరి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది.

# పంటసాగులో విత్తన శుద్ధి తప్పనిసరి - జేసీ సూరజ్





**- నంద్యాల కిసాన్ మేళాలో ఆకట్టుకున్న ప్రకృతి వ్యవసాయ స్టాల్**
**- ప్రకృతి సాగులో ప్రతిభ కనపరిచిన ప్రగతిశీల రైతులకు జేసీ చేతుల మీదుగా సన్మానం**
**- పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా స్థాయి కిసాన్ మేళా**
**- స్టాల్ ను సందర్శించిన వ్యవసాయ, ఉద్యాన, డీఆర్‌డీప అధికారులు**




**నంద్యాల ప్రతినిధి, అక్టోబరు 23 (డ్రీమ్ టైమ్స్)**
వాతావరణ మార్పుల నేపథ్యంలో రబీ సాగులో రసాయన రహితంగా విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని, ఎల్ నినో, వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, ఆత్మ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా స్థాయి కిసాన్ మేళా, రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ ముందుగా ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటు చేసిన స్టాల్ ను సందర్శించి పరిశీలించారు. స్టాల్ లోని పిఎండిఎస్, కిచెన్ గార్డెన్ కిట్స్, చిరుధాన్యాలు, తాజా ఆకుకూరలు, కూరగాయలు, కషాయాలు, ఎన్ టి ఎఫ్ పి ఉత్పత్తులు, అటవి ఉత్పత్తులు, అడవి తేనె, నన్నారి, ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపుతో కూడిన విలువ ఆధారిత ఉత్పత్తుల వివరాలను రైతు ఉత్పత్తిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో రబీ పంటల్లో రసాయన రహితంగా విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని, చీడపీడల నివారణకు జీవామృతం, వివిధ రకాల కషాయాలను వినియోగించాలన్నారు. పంట దిగుబడులకు అదనపు ఆదాయం పొందేందుకు రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రకృతి సాగులో విశేష ప్రతిభ కనబరిచిన ప్రగతిశీల రైతులకు జేసీ చేతుల మీదుగా శాలువాతో సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు పంట సరళి విధానాన్ని అనుసరించాలన్నారు. అవసరమైన ప్రకృతి సాగు ఉత్ప్రేరకాలను బయో-రిసోర్స్ సెంటర్ల ద్వారా క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ వి.జయలక్ష్మి, డీడీఏ ఆర్.గంగాధర్ రావు, డీడీఏ డిఆర్సి చెన్నయ్య , కేవీకే చైర్మన్ బాలాజి, శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు, రమణయ్య, లక్ష్మీప్రియలతో పాటు ఉద్యాన శాఖల అధికారులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళా రైతులు పాల్గొన్నారు.

## చిట్వేలి పరిషత్ పోరులో..
# మహామహులు!

**-ఎంపీపీ పీఠంపై కూటమి రాష్ట్రస్థాయి నేతల గురి**
**- కూటమి ఎంపీపీ అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర నేత కస్తూరి విశ్వనాథ నాయుడు సతీమణి డాక్టర్ వరలక్ష్మి**
**- నాగవరం ఎంపీటీసీ స్థానంపై టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ దృష్టి**
**- కే.ఎస్. అగ్రహారం బరిలో క్లాస్-1 స్పెషల్ కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులు రెడ్డి సతీమణి సుమలత**
**- మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు 92 నామినేషన్లు**
**- టీడీపీ 38, వైకాపా 32, జనసేన 15.. మిగిలిన పార్టీల నుంచి 7**



**చిట్వేలి (డ్రీమ్ టైమ్స్), అక్టోబరు 23**
తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండల పరిషత్ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కూటమికి చెందిన రాష్ట్రస్థాయి నాయకులు తమ రాజకీయ పలుకుబడిని రంగంలోకి దింపుతున్నారు. మండలంలోని కీలక ఎంపీటీసీ స్థానాల్లో ప్రముఖ రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు, పారిశ్రామిక రంగానికి చెందిన వారి కుటుంబాల నుంచి అభ్యర్థులు బరిలోకి దిగడంతో పరిషత్ పోరుకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. మరోవైపు మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు 92 నామినేషన్లు దాఖలు కావడం, ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొనడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ఎంపీపీ పీఠంపై కూటమి గురి!**
చిట్వేలి మండల పరిషత్ అధ్యక్ష పదవిని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కూటమి నాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. టీడీపీ రాష్ట్ర నాయకుడు, రైల్వేకోడూరు నియోజకవర్గ మాజీ టీడీపీ అధ్యక్షుడు కస్తూరి విశ్వనాథ నాయుడు సతీమణి డాక్టర్ కస్తూరి వరలక్ష్మిని కూటమి ఎంపీపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. ఆమె నామినేషన్ కార్యక్రమానికి రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు, కస్తూరి విశ్వనాథ నాయుడు హాజరయ్యారు. రాష్ట్రస్థాయి నాయకుల సమక్షంలో నామినేషన్ దాఖలు కావడం ద్వారా ఎంపీపీ పీఠంపై కూటమి పెట్టుకున్న ఆశలు, ప్రాధాన్యాన్ని చాటినట్లయింది.

**నాగవరం స్థానంపై పంతగాని గురి!**
టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తన స్వగ్రామమైన నాగవరం ఎంపీటీసీ స్థానంపై ప్రత్యేక దృష్టి సారించారు. తన సమీప బంధువును అభ్యర్థిగా నామినేషన్ వేయించి ఎన్నికల బరిలో నిలిపారు. రాష్ట్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరించే ఆయన, స్వగ్రామ పరిధిలోనూ తన రాజకీయ పట్టును చాటుకునే దిశగా అడుగులు వేస్తున్నారనే చర్చ సాగుతోంది. దీంతో నాగవరం ఎంపీటీసీ స్థానం కూడా పరిషత్ ఎన్నికల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

**కే.ఎస్. అగ్రహారంలో కాంట్రాక్టర్ కుటుంబం**
కే.ఎస్. అగ్రహారం ఎంపీటీసీ స్థానానికి క్లాస్-1 స్పెషల్ కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులు రెడ్డి సతీమణి పాటూరి సుమలత నామినేషన్ దాఖలు చేశారు. ప్రముఖ కాంట్రాక్టర్ కుటుంబం నుంచి అభ్యర్థి బరిలోకి దిగడంతో ఈ స్థానం కూడా రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ఎంపీపీ అభ్యర్థి ఎంపికతోపాటు కీలక ఎంపీటీసీ స్థానాల్లో తమకు అనుకూలమైన అభ్యర్థులను నిలబెట్టడంపై కూటమి నాయకులు దృష్టి సారించినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**12 స్థానాలకు 92 నామినేషన్లు**
చిట్వేలి మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 92 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీల వారీగా తెలుగుదేశం పార్టీ నుంచి 38, వైకాపా నుంచి 32, జనసేన నుంచి 15, భాజపా నుంచి 3, భారతీయ చైతన్య యువజన పార్టీ నుంచి ఒకటి, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు సమర్పించారు. మొత్తం నామినేషన్లలో టీడీపీ, వైకాపా అభ్యర్థుల వాటానే అధికంగా ఉండగా, జనసేన కూడా గణనీయమైన సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసింది.

**టీడీపీ, వైకాపా మధ్య పోటీ ఆసక్తికరం**
నామినేషన్ల గణాంకాలను పరిశీలిస్తే టీడీపీ 38 నామినేషన్లతో మొదటి స్థానంలో ఉండగా, వైకాపా 32 నామినేషన్లతో తర్వాతి స్థానంలో నిలిచింది. ఈ రెండు పార్టీల మధ్య ఆరు నామినేషన్ల వ్యత్యాసం ఉంది. జనసేన 15 నామినేషన్లతో పోటీలో తన ఉనికిని చాటుకుంది. అయితే నామినేషన్ల సంఖ్య ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. అభ్యర్థుల బలం, స్థానిక సమీకరణాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఓటర్ల మద్దతు వంటి అంశాలు తుది ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి.

**రాష్ట్రస్థాయి నేతల దృష్టి.. స్థానికంగా ఉత్కంఠ**
ఎంపీపీ అభ్యర్థిగా డాక్టర్ వరలక్ష్మి బరిలోకి దిగడం, నాగవరం, కే.ఎస్. అగ్రహారం స్థానాల్లో ప్రముఖ కుటుంబాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేయడం చిట్వేలి పరిషత్ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యాన్ని తీసుకొచ్చాయి. రాష్ట్రస్థాయి నాయకులు ప్రత్యక్షంగా నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొనడం, కీలక స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం చూస్తుంటే ఈ పరిషత్ పోరు స్థానిక స్థాయిని దాటి రాజకీయ ప్రతిష్ఠకు సంబంధించిన పోటీగా మారుతున్నట్లు కనిపిస్తోంది.

# నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!





**-మూడో రోజు నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**

**-సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీతో నిరంతర నిఘా.. పోలీసు అధికారులకు కీలక ఆదేశాలు**

నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 23, 2026.
నంద్యాల :నంద్యాల జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్, పోలీసు అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ మూడో రోజుకు చేరుకున్న నేపథ్యంలో శుక్రవారం నంద్యాల కళాశాలలోని నామినేషన్ కేంద్రంతో పాటు శిరివెళ్ల, రుద్రవరం ప్రాంతాల్లోని కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల నిర్వహణ తీరును సమీక్షించిన ఎస్పీ.. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల పరిసర



ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన చోట వీడియోగ్రఫీతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

నామినేషన్ కేంద్రాల వద్ద ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధించిన ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనవసరంగా గుమిగూడటం, ర్యాలీలు నిర్వహించడం, అధిక సంఖ్యలో మద్దతుదారులను వెంట తీసుకురావడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. అనుమతి పొందిన వాహనాలు, వ్యక్తులకు మాత్రమే నామినేషన్ కేంద్రాల వద్దకు ప్రవేశం ఉంటుందని తెలిపారు.

**శాంతియుత ఎన్నికలకు సహకరించాలి**

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ వర్గాల ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి సహకరిస్తూ నిబంధనల అమలులో భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఫిర్యాదు ఎవరికి చేసుకుంటే మాకేంటి ? తగ్గేదే లేదు

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు ఇబ్బందికరంగా చేస్తున్న విషయాలను ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జెఎండి, నంద్యాల జిల్లా ఆర్ఎం, నంద్యాల డిపో డిఎం దృష్టికి తీసుకువెళ్లిన ప్రయాణికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ఆత్మకూర్ బస్టాండ్ డిపో బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న విషయం, నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదిఖాన వద్ద ఆత్మకూరు డిపో బస్సులు ప్రయాణికులు దిగడానికి బస్సులు నిలబెట్టడం లేదని పత్రికలలో వచ్చినప్పటికీ, పత్రిక కటింగ్ తో పాటు ప్రయాణికులు లిఖితపూర్వకముగా నంద్యాల జిల్లా ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదు. మొన్నటికి మన్న ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జే ఎం డి నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా ఆత్మకూరు డిపో బస్సు కండక్టర్లు, డ్రైవర్లు నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదిఖాన వద్ద స్టాపింగ్ ఉన్న బస్సు నిలబెట్టడం లేదని, ప్రయాణికులు ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జే ఎం డి దృష్టికి తీసుకో వెళ్లడం జరిగింది. ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జే ఎం డి, నంద్యాల జిల్లా ఆర్ ఎం, కు వివరణ కోరగా



ప్రతి డిపో డ్రైవర్లకు, కండక్టర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని, ప్రతి ఒక్క డ్రైవర్ స్టాపింగ్ ఉన్నచోట బస్సు స్టాపింగ్ చేసి ప్రయాణికులకు దింపి మళ్లీ ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగిందని చెప్పడం జరిగిందని తెలిపారు. కానీ ఈరోజు మళ్లీ అదే సమస్య ప్రయాణికులకు పునరావృతం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు గురి అవుతూ రాష్ట్ర ఆర్టీసీ జే ఎం డీ, నంద్యాల జిల్లా ఆర్ఎం, నంద్యాల డిపో డిఎం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని మహిళలు వాపోతున్నారు. శుక్రవారం ఒక మహిళ నంద్యాల బస్టాండ్ నందు ఆత్మకూరు డిపో బస్సు ఎక్కి నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాది ఖానా స్టాపింగ్ వద్ద బస్సు నిలబెట్టాలని చాలాసేపు మొరపెట్టుకున్న డ్రైవర్ విని విన్నట్టు ప్రయాణికులకు మహిళలని చూడకుండా చెరువు కట్ట వద్ద బస్సు నిలబెట్టి మహిళల ప్రయాణికులను దింపినట్లు మహిళా ప్రయాణికులు తెలిపారు. ఆత్మకూరు డిపో బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రతిరోజు ప్రయాణికుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తున్నారని, ఎన్నిసార్లు వారిని రిక్వెస్ట్ చేసిన డ్రైవర్లు ఎన్టీఆర్ షాదిఖాన వద్ద నిలబెట్టడం లేదని, అక్కడ ఉన్న ప్రయాణికులకు కూడా ఎక్కించుకోవడంలేదని అన్నారు. ఏదేమైనా జిల్లా అధికారులు స్పందించి నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదిఖాన వద్ద ప్రయాణికులకు దించే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

# మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ తీరుపై విమర్శలు

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల జిల్లా కేంద్రంలో డ్రైవింగ్ లైసెన్స మంజూరులో ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ చేతివాటంతో జేబులు నిలుపుకుంటున్నాడని డ్రైవింగ్ లైసెన్సు దారులనుండి విమర్శలు గుప్పుమంటున్నాయి. డ్రైవింగ్ లైసెన్సు కోసం డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నప్పుడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ నిర్లక్ష్యం వహిస్తూ డ్రైవింగ్ టెస్ట్ చేసేటప్పుడు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నచ్చినోనికి పాస్, నచ్చనోనికి ఫెయిల్ అన్న రీతిలో ప్రవర్తిస్తున్నారని పలువురు లైసెన్స్ దారులు తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డ్రైవింగ్ టెస్ట్ డ్యూటీలో ఉన్నప్పుడు , ఏకపక్షరీతిగా వ్యవహరిస్తూ, తనకు నచ్చిన వారు డ్రైవింగ్ చేయలేకపోయినా పాస్ చేస్తున్నాడని, నచ్చని వారు నజరానా ఇవ్వనివారు డ్రైవింగ్ ఎంత మంచిగా చేసినా ఫెయిల్ చేస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నాడని పలువురు డ్రైవింగ్ టెస్ట్ దారులు వాపోతున్నారు. టు వీలర్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ టెస్ట్లో లేనిపోని ఆంక్షలతో డ్రైవింగ్ ముందుకు వెళ్లేటప్పుడు పాము మెలికల వలె వెళ్లి, రివర్స్లో వచ్చేటప్పుడు పాము మెలికల వల్లే రివర్స్ రావాలని డ్రైవింగ్ టెస్ట్ దారులకు ఇబ్బందులు గురి చేస్తూ, లేనిపోని ఆంక్షలు విధిస్తున్నారని అంటున్నారు. హెవీ డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవింగ్ చేస్తున్న వారి వైపు చూడకుండా ఎక్కడో చాటున ఉండి డ్రైవింగ్ చేస్తూ హెవీ డ్రైవింగ్ చేసేవారు స్ట్రైట్ గా ముందుకు వెళ్లి మళ్లీ స్ట్రైట్ గా వెనక్కి వచ్చే విధంగా డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారని,







డ్రైవింగ్ చేస్తూ ఉండగానే తనకు నచ్చిన వారికి పాస్ అనే టిక్ మార్క్ చేసుకొని ఇంకా కొంతమంది డ్రైవింగ్ చేస్తూ ఉండగానే , గమనించకుండా డ్రైవింగ్ స్కూల్ కారులో కార్యాలయానికి వెళ్లిపోతున్నాడని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో వచ్చిన డ్రైవింగ్ టెస్ట్ విద్యార్థులకు ప్రతి ఒక్కరికి పాస్ చేస్తూ, పక్షకపాత వైఖరిని అవలంబిస్తున్నారని డ్రైవింగ్ లైసెన్స్ దార్లు వాపోతున్నారు.డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యంతో మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ కు అవినాభావ సంబంధాలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

**నిష్పక్షపాతముగా డ్రైవింగ్ టెస్ట్**
**మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ .**

టు వీలర్, లైట్ మోటర్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ టెస్ట్లో నిష్పక్షపాతముగా డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారని, పాస్ అయిన వారికి పాస్ చేస్తూ, ఫెయిల్ అయిన వారికి ఫెయిల్ చేస్తున్నానని, డ్రైవింగ్ టెస్ట్ వచ్చిన వారి నుండి ఎటువంటి లావాదేవీలు ఆశించడం లేదని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. డ్రైవింగ్ టెస్ట్లో నచ్చిన వారికి పాస్ చేస్తున్నానని, నచ్చని వారికి ఫెయిల్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నానన్న విషయం వాస్తవం కాదని తెలిపారు. 22వ తేదీ నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్ లలో టూ వీలర్ 25 మంది హాజరుకాగా 24 మంది పాసయ్యారని, ఒక్క వ్యక్తి ఫెయిల్ అయ్యారని అన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ టెస్ట్లో 23 మంది హాజరు కాగా 11మంది పాస్ అయ్యారని, 12 మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లు 10 మంది హాజరు కాగా 3 పాస్ అయ్యారని, 7 మంది ఫైయిల్ అయ్యారని అన్నారు. నా వాహనం రిపేర్ రావడంతో డ్రైవింగ్ స్కూల్ వాహనంలో కార్యాలయానికి చేరుకున్నట్లు తెలిపారు . డ్రైవింగ్ స్కూల్ వాహన యజమానితో నాకు ఎటువంటి అవినాభావ సంబంధాలు లేవని అన్నారు. నేను డ్యూటీలో నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్ లలో పై అధికారులు పరిశీలించి నేను చేసిన టెస్టులలో అవకతవకలు జరిగి ఉంటే, ప్రభుత్వం నాపై ఎటువంటి చర్యలు తీసుకున్నా సిద్ధమేనని అన్నారు.

# నంద్యాలలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తాం.

**-ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ధీమా.**

**-15వ వార్డులో వైసీపీ అభ్యర్థి బైసాని రమేష్ బాబు గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం.**



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాలలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల 15వ వార్డులో వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థి బైసాని రమేష్ బాబు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగించారు. వైఎస్ఆర్సిపి అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి దాల్ మిల్ అమీర్తో పాటు 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బైసాని రమేష్ బాబును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో నంద్యాలలో వైఎస్ఆర్సిపి ఘన విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల దాఖలుకు ఆటంకాలు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయండి.

**-అభ్యర్థులకు నామినేషన్ల దాఖలులో ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు.**

**-ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారి అందుబాటులో ఉంటారు.**

**--కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నంబర్: 78159 59525.**

**-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**



నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్ .
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా, ఎవరైనా నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నా, సంబంధిత అభ్యర్థులు వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 78159 59525 ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించి అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక అధికారిని కేటాయించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేలా సంబంధిత రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేయడంలో నిజంగా ఆటంకాలు ఎదుర్కొంటున్న అభ్యర్థులు తమ సమస్యలను నిర్భయంగా కంట్రోల్ రూమ్‌కు తెలియజేసి అధికారుల సహకారం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మైనారిటీల హక్కుల రక్షణకై వైస్సార్సీపీకి మద్దతుగా నిలుద్దాం -సుహైల్ రానా.



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పట్టణంలోని స్థానిక 44వ వార్డు వైస్సార్సీపీ కౌన్సిలర్ అభ్యర్థి,యువ న్యాయవాది సుహైల్ రానా మాజీ కౌన్సిలర్ తమీమ్ అన్సారీ శుక్రవారం నమాజ్ అనంతరం వార్డులోని ముస్లిం సోదరులు,పెద్దలను కలుస్తూ మున్సిపల్ ఎన్నికల్లో వైస్సార్సీపీ కి మద్దతు ఇవ్వాలని కోరారు.
ఈ సందర్భంగా సుహైల్ రానా మాట్లాడుతూ మసీదు బయట ముస్లిం సోదరులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ మైనారిటీల సంక్షేమం,హక్కుల పరిరక్షణకై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఒక న్యాయవాదిగా వార్డు ప్రజల సమస్యలను చట్టపరంగా,పరిపాలనాపరంగా సమర్థవంతంగా పరిష్కరిస్తానని ప్రతి ముస్లిం సోదరుడికి హామీ ఇస్తున్నామన్నారు . కావున 44వ వార్డు ప్రజలందరూ నవంబర్ 1వ తేదీ జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు రాఘవ, ఎస్.కే బాషా, అర్షద్, షాహిన్షా, రఫీ, ఇర్ఫాన్, సాదిక్, అరిఫ్, జుబేర్, రెహేమాన్, శ్రీను ఎస్డీపిఐ నాయకులు సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు వైభవంగా ఊయలసేవ




**తేదీ: 23.10.2026 । డ్రీమ్ టైమ్స్ తెలుగు**

శ్రీశైలం: లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్లకు ఊయలసేవ నిర్వహించారు. ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో ఈ ఊయలసేవను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ నిర్వహించారు. తదుపరి ఊయలలో వేంచేపు చేసిన శ్రీస్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి, అనంతరం ఊయలసేవ జరిపించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు విశేష పుష్పాలంకరణ చేసి, పుష్పార్చనలు నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామి అమ్మవార్లను అలంకరించారు.

# నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లు

**-నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు.. అభ్యర్థులకు పోలీసుల పూర్తి సహకారం**



**నంద్యాల క్రైమ్ ।డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 23, 2026.**

నంద్యాల :నంద్యాల జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. జిల్లాలోని మొత్తం 28 మండలాల్లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ చేపడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతిస్తూ, టోకెన్లు జారీ చేసి ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నారు.

**అభ్యర్థులకు పోలీసుల పూర్తి సహకారం**

నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేదా ఆటంకాలు ఎదురైనా సంబంధిత కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసు సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.

**పటిష్ట భద్రతా చర్యలు**

జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియకు సహకరించాలని సూచించారు.

# నంద్యాలలో అభివృద్ధి శూన్యం..

**- అక్రమాలు, భూకబ్జాలే ఫుల్!.. శిల్పా**

**-ఇది మంచి ప్రభుత్వం కాదు.. ప్రజలను ముంచే ప్రభుత్వం!మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి..**







**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె, సాయిబాబా నగర్ లో మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, ఎన్నికల ప్రచారం నిర్వహించారు రాష్ట్రంలో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక ధరల భారం మోపి వారి నడ్డి విరిచిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి విమర్శించారు. నంద్యాలలో మంత్రి పాలనలో అభివృద్ధి శూన్యమని, అక్రమాలు, భూకబ్జాలు రౌడీయిజం పెరిగాయని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని పేర్కొన్నారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి దాల్మిల్ అమీర్‌తో పాటు 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సునీత అమృత రాజ్, 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఉషేనమ్మ, 36వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మఖూమ్నిసా, 37వ వార్డు షేక్ శివనాజ్ లను గెలిపించాలని వైసీపీ నాయకులు ప్రజలను కోరారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో వైసీపీ అభ్యర్థులను గెలిపించి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించాలని కోరారు.

# శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సింహగర్జన

**-"నేను సండే ఎమ్మెల్యే కాదు.. సత్తా ఉన్న లీడర్‌ను!"**

**-నంద్యాల గడ్డపై వైఎస్ఆర్సిపి శ్రేణుల హోరు.. అభివృద్ధిపై మంత్రి ఫరూక్‌కు సూటి ప్రశ్న!**

**-'సండే ఎమ్మెల్యేనంటూ విమర్శిస్తారా? నంద్యాలను జిల్లా చేసింది ఎవరో చెప్పాలి!"**

**-మెడికల్ కాలేజీ, అమృత్ పథకం, వేల ఇళ్ల పట్టాలు.. నంద్యాలలో అభివృద్ధి చేసి చూపించింది శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డే!**

**-40 ఏళ్ల రాజకీయ అనుభవమున్న మంత్రి ఫరూక్ నంద్యాలకు ఏం చేశారో సమాధానం చెప్పాలి.**

**-మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి .**





**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**

'నేను సండే ఎమ్మెల్యే కాదు.. ప్రజల గుండెల్లో నిలిచిన సత్తా ఉన్న ఎమ్మెల్యేను!" అంటూ నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నిప్పులు చెరిగారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 2,3,4,12, 46,47 వార్డుల్లో ఆయన దూసుకుపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభల్లో శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి చేసిన ప్రసంగం నంద్యాల రాజకీయాల్లో ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, చైర్మన్ అభ్యర్థి అమీర్ భాషా (దాల్మిల్ అమీర్), స్థానిక కౌన్సిలర్ అభ్యర్థులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి ఫరూక్ కు సూటి ప్రశ్న.... శిల్పా రవి రెడ్డి సంధించారు..."40 ఏళ్ల రాజకీయంలో మీరు చేసిందేంటి?"

ఈ సందర్భంగా ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు శిల్పా రవిరెడ్డి. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే మంత్రి ఫరూక్.. నంద్యాల అభివృద్ధికి ఏం చేశారో సూటిగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఎన్నికలు వస్తేనే మొఖం చాటేసే నాయకులను, కష్టకాలంలో ప్రజల మధ్య లేని వాళ్లను ప్రజలు గమనించాలని కోరారు.

**"సండే ఎమ్మెల్యే కాదు.. సత్తా ఉన్న లీడర్!"**

తనను కొందరు 'సండే ఎమ్మెల్యే' అంటూ ఎద్దేవా చేస్తున్నారని, కానీ తాను చేతలతో చూపించిన సత్తా ఉన్న లీడర్ అని రవిచంద్ర కిషోర్ రెడ్డి గర్జించారు. కేవలం మూడు సంవత్సరాల కాల వ్యవధిలో నంద్యాలలో చేపట్టిన అభివృద్ధి చరిత్రే తన సాక్ష్యమని స్పష్టం చేశారు.

**నంద్యాలలో శిల్పా రవి హయాంలో జరిగిన అభివృద్ధి ఇదీ:**

నంద్యాలను ప్రత్యేక జిల్లా కేంద్రంగా మార్చడం.
పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా 'అమృత్ పథకం' తేవడం.
అత్యాధునిక సౌకర్యాలతో మెడికల్ కళాశాల, ఉర్దూ కళాశాల, ఐటీఐ కళాశాల, మహిళా జూనియర్ కళాశాలల ఏర్పాటు.
పేదల కోసం ఏకంగా 5,500 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ.
పట్టణంలో 8 పార్కులు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మిల్క్ కేంద్రాల నిర్మాణం.
నాడు-నేడు' కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం, ప్రతి సందులోనూ సీసీ రోడ్లు, కలెక్టర్ బంగ్లా, జేసీ బంగ్లా, పద్మావతి నగర్ రోడ్ల నిర్మాణం.

**కష్టకాలంలో ఆదుకున్న వైఎస్ఆర్సిపిని గెలిపించండి!**

కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన కష్టకాలంలో పేద ప్రజలకు అండగా నిలిచింది ఎవరో ప్రజలు గుర్తుంచుకోవాలని శిల్పా రవిరెడ్డి కోరారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. కానీ, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చి, నేడు నంద్యాల పట్టణాభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని ధ్వజమెత్తారు.

**అమీర్ బాషను భారీ మెజారిటీతో గెలిపించండి!**

నంద్యాల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న అమీర్ బాష (దాల్మిల్ అమీర్) తో పాటు, 4వార్డు వైసీపీ అభ్యర్థి పురందర్ కుమార్, 12వార్డు అభ్యర్థి మస్తాన్ బాబా,3వార్డు వైసీపీ అభ్యర్థి అమీర్,46 వార్డు వైసీపీ అభ్యర్థి సాధిక్ బాషా, 2వార్డు వైసిపి అభ్యర్థి మునయ్య, 47వ వార్డు వైసిపి అభ్యర్థి కాల్వ ఆశీనా ను వైసిపి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు...

52 వార్డువార్డుల్లో పోటీ చేస్తున్న వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. నంద్యాల ప్రగతి మరింత ముందుకు సాగాలంటే వైఎస్ఆర్సిపి జెండా ఎగరాలని, ప్రజలంతా అమూల్యమైన ఓట్లతో ఫ్యాన్ గుర్తును గెలిపించి పట్టణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఆర్‌బీసీ, గోరుకల్లు జలాశయ సాధనలో

# బొజ్జా వెంకటరెడ్డి కృషి మరువలేనిది.

**-రైతాంగ సంక్షేమం, సాగునీటి సాధన, సామాజిక సామరస్యానికి బొజ్జా వెంకట రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం.**

**-నంద్యాల పెద్దాయన' 24వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.**




**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**

రైతుల పక్షపాతిగా, ప్రజానాయకుడిగా, 'నంద్యాల పెద్దాయన'గా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కీర్తిశేషులు బొజ్జా వెంకట రెడ్డి గారి 24వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నంద్యాలలోని ఆయన స్వగృహంలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు పాల్గొని వ్యవసాయ అభివృద్ధి, సాగునీటి సాధన, విద్య, ప్రాంతీయ ప్రగతి, సామాజిక సామరస్యానికి ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు.

శ్రీశైలం కుడి బ్రాంచ్ కెనాల్ (ఎస్ఆర్‌బీసీ), గోరుకల్లు జలాశయం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని, వ్యవసాయ పరిశోధన, విత్తనాభివృద్ధికి అందించిన సహకారాన్ని, నంద్యాలలో శాంతి సామరస్యాలను పెంపొందించడంలో పోషించిన పాత్రను వక్తలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిరాడంబరత, ఆప్యాయత, ప్రజలతో మమేకమయ్యే స్వభావం కలిగిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. ప్రజాసేవ, రైతాంగ సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**రైతాంగ అభ్యున్నతికి విశేష కృషి.**

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) అభివృద్ధికి, నంద్యాలలో విత్తనాభివృద్ధికి, జాతీయ విత్తన సంస్థ కార్యకలాపాల ఏర్పాటుకు బొజ్జా వెంకట రెడ్డి గారు విశేషంగా కృషి చేశారని వక్తలు గుర్తుచేశారు. నంద్యాలలో జాతీయ విత్తన సంస్థ యూనిట్ ఏర్పాటు చేయడంతోపాటు, కర్నూలు, బళ్లారి ప్రాంతాల్లో దాని కార్యకలాపాలను బలోపేతం చేయడంలో ఆయన పాత్రను ప్రస్తావించారు. జాతీయ విత్తన సంస్థ చైర్మన్‌గా పనిచేసిన ఆయన దేశవ్యాప్తంగా వ్యవసాయ, విత్తన రంగాల అభివృద్ధికి దోహదపడ్డారని కొనియాడారు.

వ్యవసాయ కళాశాలను నంద్యాల ప్రాంతానికి తీసుకురావడంలో ఆయన చేసిన కృషిని, పరిశోధన స్థానం కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా కళాశాలను మహానందిలో ఏర్పాటు చేయించడంలో చూపిన చొరవను వక్తలు గుర్తుచేశారు. వ్యవసాయ పరిశోధన, విత్తనోత్పత్తి అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రాంతీయ వ్యవసాయ రంగానికి బలమైన పునాదులు వేసిందని, రైతుల జీవనోపాధికి తోడ్పడిందని పేర్కొన్నారు.

**సాగునీటి సాధనలో చెరగని ముద్ర.**

ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టు, గోరుకల్లు జలాశయం సాధనలో బొజ్జా వెంకట రెడ్డి గారు చేసిన కృషి మరువలేనిదని వక్తలు తెలిపారు. రాయలసీమ రైతాంగ అభివృద్ధికి సాగునీరు ఎంత కీలకమో గుర్తించి, నీటి వసతుల అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం సాగునీటి ప్రాజెక్టుల సాధనకు ఆయన చూపిన నిబద్ధత నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

**ప్రజాసేవ, ప్రజాస్వామ్య విలువలకు ఆదర్శం.**

బొజ్జా వెంకట రెడ్డి శాసనసభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగా ప్రజలకు సేవలందించి, ప్రజలతో మమేకమై పనిచేయడం ద్వారా వారి హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని వక్తలు పేర్కొన్నారు.

నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం నుంచి నీలం సంజీవరెడ్డి గారి ఎన్నికలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తుచేశారు. అలాగే పీవీ నరసింహారావు గారిని నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయించడంలో, ఆయన ఘన విజయం సాధించడంలో బొజ్జా వెంకట రెడ్డి రాజకీయ చతురత, ప్రజల్లో ఉన్న ఆదరణ ప్రతిబింబించాయని తెలిపారు.

వివిధ వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగడం, ప్రజాభిప్రాయాలను గౌరవించడం, నైతిక విలువలకు కట్టుబడి ప్రజాసేవ చేయడం ఆయన రాజకీయ జీవితంలోని విశిష్ట లక్షణాలని పేర్కొన్నారు. నేటి రాజకీయ నాయకులు ఆయన నిరాడంబరత, సమగ్రత, ప్రజాసేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**ఆర్ఏఆర్ఎస్ పరిరక్షణకు పిలుపు.**

నంద్యాల ప్రాంత వ్యవసాయ పరిశోధన, అభివృద్ధికి కీలకమైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)ను పరిరక్షించి, మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు స్పష్టం చేశారు. వ్యవసాయ పరిశోధన సదుపాయాలు, రైతులకు ఉపయోగపడే ప్రజా ఆస్తులు దెబ్బతినేలా నిర్ణయాలు తీసుకోరాదని హెచ్చరించారు. ప్రాంత భవిష్యత్తు అభివృద్ధిని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే ముందు రైతులు, వ్యవసాయ నిపుణులు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సంప్రదింపులు జరపాలని కోరారు. ఆర్ఏఆర్ఎస్‌ను పరిరక్షించడం ద్వారా వ్యవసాయ పరిశోధన, విత్తనాభివృద్ధి, రైతుల జీవనోపాధిని కాపాడుకోవచ్చని వారు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధమైన, సంప్రదింపులతో కూడిన పాలన అవసరం. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ప్రజల ఆశలు, ఆకాంక్షలను గౌరవిస్తూ చర్చలు, సంప్రదింపుల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని వక్తలు కోరారు. ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ప్రజలు, ప్రజా సంఘాలు ఎత్తిచూపినప్పుడు వాటిని నిర్మాణాత్మక విమర్శలుగా స్వీకరించాలే తప్ప, వ్యతిరేకతగా భావించరాదని సూచించారు.

విమర్శకులకు అన్యాయంగా ముద్రలు వేయడం, భి న్నా భి ప్రా య ా ల న ు అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ, విభజన రాజకీయాలకు దూరంగా ఉండాలని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు.

బొజ్జా వెంకట రెడ్డి గారి ఆశయాలను కొనసాగిస్తూ నంద్యాల ప్రాంత అభివృద్ధి, రైతాంగ సంక్షేమం, ఆర్ఏఆర్ఎస్ పరిరక్షణ, సాగునీటి సాధన, సామాజిక సామరస్యం కోసం కృషి చేస్తామని వక్తలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం

బొజ్జా వెంకట రెడ్డి అగ్రికల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ బొజ్జా దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యవసాయ పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవీంద్రనాథ్, రామకృష్ణ విద్యాసంస్థల అధిపతి రామకృష్ణారెడ్డి, అడ్వకేట్ శంకరయ్య, సౌదాగర్ ఖాసిం మియా, వ్యాపారవేత్త పరమేశ్వర రాజశేఖర్, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు షణ్ముఖ్, వ్యవసాయ వ్యాపారవేత్తలు గెలివి భాను, నిచ్చనిమెట్ల సుబ్బరామయ్య, చిత్తలూరు రామచంద్రయ్య, మహమ్మద్ పర్వేజ్, కాంగ్రెస్ నాయకులు చింతలయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

బొజ్జా వెంకట రెడ్డి అగ్రికల్చరల్ ఫౌండేషన్ ప్రతినిధులు యర్రం శంకర్ రెడ్డి, ఏర్వ రామచంద్ర రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నిట్టూరి సుధాకర్ రావుతో పాటు రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు పట్నం రాముడు, రాము, మనోజ్, అసదుల్లా, మెహబూబ్ భాష పాల్గొన్నారు.

ఇతర ప్రముఖుల్లో ఎల్.కె.ఆర్. విద్యాసంస్థల అధిపతి లక్ష్మీకాంత రెడ్డి, డాక్టర్ రమణారెడ్డి, విశ్రాంత ఆంధ్ర బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివనాగిరెడ్డి, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, బొజ్జా వెంకట రెడ్డి కుటుంబ సభ్యులు శివగోపాల్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాస్టర్ యువన్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త కల్లూరి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాల్గొన్న వారంతా బొజ్జా వెంకట రెడ్డి గారికి ఘనంగా నివాళులర్పిస్తూ, ప్రజాసేవ, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి సాధన, నంద్యాల ప్రాంత అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

# బిజినెస్

## భారీగా తగ్గిన బంగారం ధరలు

-హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరల పతనం
-24 క్యారెట్ల 10 గ్రాములపై రూ.1,900 తగ్గుదల
-రూ.1,42,480కు చేరిన స్వచ్ఛమైన బంగారం ధర
-22 క్యారెట్ల బంగారంపై రూ.1,750 తగ్గింపు
-రూ.1,30,600 వద్ద కొనసాగుతున్న ఆభరణాల బంగారం
-కిలో వెండి ధరలో మార్పులేదు
-రూ.2,25,000 వద్ద స్థిరంగా వెండి ధర
-బంగారం, వెండి ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ



హైదరాబాద్
బులియన్ మార్కెట్‌లో శుక్రవారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,900 తగ్గి రూ.1,42,480కు చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,750 తగ్గి రూ.1,30,600 వద్ద కొనసాగుతోంది. పసిడి ధరలు తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. కిలో వెండి ధర రూ.2,25,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. బంగారం, వెండి కొనుగోళ్లపై ప్రకటించిన ధరలకు అదనంగా 3 శాతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.

## తొమ్మిది నెలల్లో కిలో వెండిపై రూ.2 లక్షల పతనం

-హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో భారీగా తగ్గిన వెండి ధర
-జనవరి 29న కిలో వెండి గరిష్ఠ ధర రూ.4.25 లక్షలు
-ప్రస్తుతం రూ.2.25 లక్షలకు పడిపోయిన కిలో వెండి
-తొమ్మిది నెలల్లోనే రూ.2 లక్షల మేర తగ్గుదల
-ధరల పతనంతో కొనుగోలుదారుల్లో ఆసక్తి
-వెండి కొనుగోళ్లకు అనుకూల సమయమా?
-ధరలు మరింత తగ్గే అవకాశాలపై చర్చ
-విడతలవారీగా కొనుగోలు చేయాలని నిపుణుల సూచన



హైదరాబాద్:
బులియన్ మార్కెట్‌లో వెండి ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ ఏడాది జనవరి 29న కిలో వెండి ధర గరిష్ఠంగా రూ.4,25,000 ఉండగా, ప్రస్తుతం రూ.2,25,000కు పడిపోయింది. దాదాపు తొమ్మిది నెలల వ్యవధిలోనే కిలో వెండిపై రూ.2 లక్షల మేర తగ్గుదల నమోదైంది. వెండి ధరల్లో ఈ భారీ పతనం కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. గతంలో అధిక ధరల కారణంగా కొనుగోళ్లకు వెనుకాడినవారు ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను పరిశీలిస్తున్నారు. అయితే, ధరలు మరింత తగ్గుతాయా లేదా అన్నది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ధరల కదలికలను గమనిస్తూ ఒకేసారి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయకుండా, విడతలవారీగా కొనుగోలు చేయడం మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. వెండిలో పెట్టుబడి పెట్టాలనుకునేవారు ప్రస్తుత ధరలతో పాటు మార్కెట్ ఒడిదొడుకులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు.

## నష్టాల్లోనే స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 125 పాయింట్లు డౌన్

-వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిసిన సూచీలు
-సెన్సెక్స్ 125.56 పాయింట్లు పతనం
-నిఫ్టీ 87.65 పాయింట్లు నష్టపోయిన వైనం
-మార్కెట్‌పై ఒత్తిడి పెంచిన క్రూడాయిల్ ధరలు
-డాలర్‌తో పోలిస్తే 94.94కు పడిపోయిన రూపాయి
-ఎటర్నల్ షేర్లలో 3.97 శాతం లాభం
-టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ షేర్లకు నష్టాలు
-ఒడిదుడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిసిన ట్రేడింగ్



భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 125.56 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 87.65 పాయింట్లు కోల్పోయాయి. దీంతో వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్టాలను నమోదు చేశాయి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు మధ్యలో కొంత కోలుకున్నప్పటికీ, చివరకు నష్టాల నుంచి పూర్తిగా బయటపడలేకపోయాయి. సెన్సెక్స్ ఉదయం 73,665.64 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్ సమయంలో 73,766.51 పాయింట్ల గరిష్ఠ స్థాయిని, 72,452.37 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 125.56 పాయింట్లు (0.17 శాతం) నష్టపోయి 73,123.83 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 87.65 పాయింట్లు (0.39 శాతం) తగ్గి 22,600 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 0.99 శాతం పెరిగి బ్యారెల్‌కు 114.29 డాలర్లకు చేరింది. మరోవైపు అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.94 వద్ద కొనసాగింది. ఈ పరిణామాలు మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్‌లో ఎటర్నల్ షేర్లు 3.97 శాతం లాభపడ్డాయి. లార్సెన్ అండ్ టూబ్రో 1.25 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.19 శాతం, టీసీఎస్ 1 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 0.83 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు టాటా స్టీల్ 3.21 శాతం, అదానీ పోర్ట్స్ 3.03 శాతం, ట్రెంట్ 2.13 శాతం, టెక్ మహీంద్రా 1.95 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 1.88 శాతం, ఇండిగో 1.78 శాతం చొప్పున నష్టపోయాయి. ప్రధాన షేర్లలో కొనుగోళ్లు, అమ్మకాల మధ్య సూచీలు చివరకు నష్టాలతోనే ముగిశాయి.

## 2028లో ఒలింపిక్స్ క్రికెట్ అర్హత పోటీలు

- జనవరి--ఫిబ్రవరిలో అర్హత మ్యాచ్‌ల నిర్వహణ
- లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కోసం ప్రత్యేక పోటీలు
- పురుషుల విభాగంలో ఎనిమిది జట్ల మధ్య పోరు
- మహిళల విభాగంలోనూ ఎనిమిది జట్లకు అవకాశం
- అర్హత సాధించిన జట్లకే ఒలింపిక్స్‌లో చోటు
- మ్యాచ్‌ల షెడ్యూల్‌పై వెల్లడికావాల్సిన పూర్తి వివరాలు
- ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనంపై అభిమానుల్లో ఆసక్తి
- పురుషులు, మహిళలకు వేర్వేరుగా అర్హత పోటీలు




లాస్ ఏంజెలెస్:
ప్రపంచ క్రీడా అభిమానులను ఆకట్టుకునే 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీల నిర్వహణకు సంబంధించి అర్హత మ్యాచ్‌లపై ఆసక్తి నెలకొంది. ఒలింపిక్స్‌లో పాల్గొనే జట్లను ఎంపిక చేసేందుకు 2028 జనవరి--ఫిబ్రవరిలో అర్హత పోటీలు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పోటీల్లో సత్తా చాటిన జట్లు ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో క్రికెట్ ఆడే అవకాశాన్ని దక్కించుకోనున్నాయి.

**రెండు విభాగాల్లోనూ ఎనిమిది జట్లు**
పురుషుల విభాగంలో ఎనిమిది జట్లు, మహిళల విభాగంలో మరో ఎనిమిది జట్లు అర్హత పోటీల్లో పాల్గొననున్నాయి. ఈ పోటీల ద్వారా ఒలింపిక్స్ క్రికెట్ విభాగానికి అర్హత సాధించే జట్లను నిర్ణయించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకోవాలనుకునే జట్లకు ఈ పోటీలు కీలకంగా మారనున్నాయి. అర్హత సాధించేందుకు ఆయా జట్లు తమ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించాల్సి ఉంటుంది.

**ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం**
లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ చోటు దక్కించుకోవడంతో ఈ క్రీడపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా క్రికెట్‌కు విస్తృత ఆదరణ ఉన్న దేశాల అభిమానులు ఒలింపిక్స్‌లో తమ జట్లు ఆడటాన్ని చూడాలని ఎదురుచూస్తున్నారు. అర్హత పోటీల్లో పాల్గొనే జట్ల ప్రదర్శన, ఒలింపిక్స్‌కు ఎంపికయ్యే దేశాలపై ఉత్కంఠ నెలకొనే అవకాశం ఉంది.

**షెడ్యూల్‌పై మరింత సమాచారం రావాల్సి ఉంది**
అర్హత పోటీలను 2028 జనవరి--ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, మ్యాచ్‌లు జరిగే వేదికలు, పాల్గొనే జట్ల వివరాలు, పోటీల విధానం, పూర్తి షెడ్యూల్‌పై మరింత స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక వివరాలు వెల్లడైన తర్వాత అర్హత సాధించే జట్ల ఎంపిక ప్రక్రియపై పూర్తి అవగాహన వచ్చే అవకాశం ఉంది.

**భారత జట్లపైనా అభిమానుల దృష్టి**
క్రికెట్‌కు భారత్‌లో ఉన్న ఆదరణ నేపథ్యంలో, ఒలింపిక్స్ అర్హత పోటీల్లో భారత పురుషులు, మహిళల జట్ల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొనే అవకాశం ఉంది. అయితే అర్హత పోటీల్లో ఏ జట్లు పాల్గొంటాయి, ఒలింపిక్స్‌కు ఎన్ని జట్లు ఎంపికవుతాయి అనే అంశాలపై అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది. మొత్తంగా 2028 ఒలింపిక్స్ క్రికెట్ పోటీలకు ముందు జరగనున్న అర్హత మ్యాచ్‌లు కీలకంగా మారనున్నాయి.

## ఇషాన్ కిషన్‌కు గాయం.. రెండో టీ20కి దూరం

-న్యూజిలాండ్‌తో తొలి టీ20లో గాయపడిన భారత బ్యాటర్
-కుడి తొడ కండరంలో స్వల్ప నొప్పి
-గాయంపై తాజా సమాచారం వెల్లడించిన బీసీసీఐ
-వైద్య బృందం పర్యవేక్షణలో ఇషాన్ కిషన్
-రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండని వికెట్ కీపర్ బ్యాటర్
-ఇషాన్ స్థానంలో వైభవ్ సూర్యవంశీకి అవకాశం?
-తొలి టీ20లో మారిన భారత బ్యాటింగ్ క్రమం
-వెస్టిండీస్ సిరీస్‌లో బెంచ్‌కే పరిమితమైన యువ ఆటగాడు



క్రైస్ట్‌చర్చ్:
భారత క్రికెట్ జట్టుకు గాయం రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కుడి తొడ కండరంలో స్వల్ప నొప్పితో బాధపడుతున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగే రెండో టీ20 మ్యాచ్‌కు అతడిని దూరంగా ఉంచారు. తొలి టీ20 సందర్భంగా ఇషాన్ గాయపడినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వెల్లడించింది. ఇషాన్ కిషన్ గాయంపై బీసీసీఐ తాజా సమాచారం అందించింది. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం పర్యవేక్షిస్తోంది. గాయం తీవ్రత, కోలుకునేందుకు పట్టే సమయంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. తొలి టీ20లో ఇషాన్ గాయపడటంతో భారత బ్యాటింగ్ క్రమంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలి వికెట్ పడిన తర్వాత తిలక్ వర్మ, శ్రేయాస్ అయ్యర్ ముందుగా బ్యాటింగ్‌కు వచ్చారు. రెండో టీ20కి ఇషాన్ అందుబాటులో లేకపోవడంతో జట్టు కూర్పులో మార్పు జరిగే అవకాశం ఉంది. ఇషాన్ స్థానంలో యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కవచ్చనే చర్చ జరుగుతోంది. అయితే అతడిని తుది జట్టులోకి తీసుకునే విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీకి ఆడే అవకాశం రాకపోవడంతో బెంచ్‌కే పరిమితమయ్యాడు. రెండో టీ20లో అతడికి అవకాశం దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# స్పోర్ట్స్

## జావెలిన్ త్రోలో ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టిన హనే

-ఆసియా పారా గేమ్స్‌లో భారత అథ్లెట్ సరికొత్త ఘనత
-పురుషుల జావెలిన్ ఎఫ్37-38 విభాగంలో స్వర్ణం
-60.49 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డు
-ఐదో ప్రయత్నంలోనూ రికార్డు స్థాయి ప్రదర్శన
-చివరి ప్రయత్నంలో తన రికార్డునే అధిగమించిన హనే
-వరుస త్రోలతో పోటీలో ఆధిపత్యం
-అద్భుత ప్రదర్శనతో భారత్‌కు మరో పసిడి పతకం
-పారా గేమ్స్‌లో వంద దాటిన భారత పతకాల సంఖ్య



నగోయా:
ఆసియా పారా గేమ్స్‌లో భారత అథ్లెట్ హనే జావెలిన్ త్రోలో సంచలనం సృష్టించాడు. పురుషుల ఎఫ్37-38 విభాగంలో రెండు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టి స్వర్ణ పతకాన్ని సాధించాడు. తన అద్భుత ప్రదర్శనతో భారత కీర్తిని మరోసారి చాటాడు. పోటీలో హనే తొలుత ఐదో ప్రయత్నంలో జావెలిన్‌ను 59.72 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఆ తర్వాత చివరి ప్రయత్నంలో మరింత మెరుగైన ప్రదర్శన చేశాడు. జావెలిన్‌ను 60.49 మీటర్ల దూరం విసిరి తన రికార్డును తానే అధిగమించాడు. ఒకే పోటీలో రెండుసార్లు ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం హనే ప్రదర్శనలో ప్రత్యేకతగా నిలిచింది. చివరి ప్రయత్నంలో నమోదు చేసిన 60.49 మీటర్ల దూరమే అతడికి స్వర్ణ పతకాన్ని అందించింది. మరోవైపు ఆసియా పారా గేమ్స్‌లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. ఈ పోటీల్లో భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య వంద దాటింది. హనే స్వర్ణంతో భారత ఖాతాలో మరో పతకం చేరింది.

## 'ఇడుపు కాయితం' నుంచి సెకండ్
# సింగిల్ 'గడప' పాట విడుదల




టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ -- బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ 'శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..' పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.

# సూర్య 'సీన్' చిత్రంలో విలన్‌గా నస్లేన్.. గ్లింప్స్ విడుదల!




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'సీన్'. కరుప్పు, విశ్వానాథన్ అండ్ సన్స్ వంటి వైవిధ్యమైన చిత్రాలతో దూసుకెళ్తున్న సూర్య ఈ చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాతో మలయాళ టాలెంటెడ్ నటుడు నస్లేన్ తమిళ చిత్ర పరిశ్రమలోకి గ్రాండ్‌గా అడుగుపెడుతున్నారు. ఇక బ్లాక్‌బస్టర్ మూవీ 'ఆవేశం' ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయితాజాగా ఈ సినిమాకు సంబంధించి చిత్ర యూనిట్ విడుదల చేసిన అప్‌డేట్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో నస్లేన్ 'ఈశ్వరన్' అనే విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ చిత్రంలో హీరో సూర్య ఒక శక్తివంతమైన పోలీస్ అధికారిగా డి.ఎస్.పి. ఇన్ద్రరాజ్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య సరసన నజ్రియా ఫహాద్ నటిస్తుండగా, మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. సూర్య, జ్యోతికల నూతన ప్రొడక్షన్ హౌస్ 'జగరం స్టూడియోస్' మరియు '2ఱ ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో అట్టహాసంగా విడుదల చేయనున్నారు. నస్లేన్ విలన్ ఎంట్రీ, సూర్య పోలీస్ గెటప్ కలిసి ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి.

# రూ.5000 కోట్ల వసూళ్లు సాధిస్తేనే సేఫ్..
## భయపెడుతున్న 'రామాయణ' బ్రేక్ ఈవెన్ టార్గెట్!



భారతీయ చలనచిత్ర చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న నితీశ్ తివారీ చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద భారీ సవాల్‌ను ఎదుర్కొనబోతుంది. ఈ సినిమాకు ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించంగా. సినిమా ఆర్థికంగా సక్సెస్ కావాలంటే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 5,000 కోట్లు రాబట్టాల్సి ఉంటుందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీపావళి కానుకగా నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్, ఓపెనింగ్స్, బాక్సాఫీస్ లెక్కలపై ట్రేడ్ ఎక్స్‌పర్ట్స్ పలు కీలక విషయాలు వెల్లడించారు. ఈ సినిమాకు ఏమాత్రం పాజిటివ్ టాక్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉందని, అయితే రూ. 2,000 కోట్ల భారీ బడ్జెట్‌ను రికవరీ చేయడం మాత్రం అంత ఆశామాషీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయంగా తొలి రోజు అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలోనే రూ. 75 నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 150 నుంచి రూ. 200 కోట్ల ప్రీ-సేల్స్ సాధిస్తేనే సినిమాకు బలమైన పునాది ఏర్పడుతుందని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నారు. ముఖ్యంగా బాలీవుడ్ మార్కెట్‌తో పాటు సౌత్ ఇండియన్ మార్కెట్ల నుంచి కనీసం 35 నుంచి 40 శాతం వసూళ్లు వస్తేనే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుంది. ఇక ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తుండగా, యశ్ రావణాసురుడిగా కనిపించనున్నారు. యశ్‌కు చెందిన మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ భారీ పాన్-ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రీవ్యూలు ప్రదర్శించనుండగా, నవంబర్ 5న సినిమా థియేటర్లలో సందడి చేయనుంది. కేవలం థియేట్రికల్ కలెక్షన్లే కాకుండా శాటిలైట్, డిజిటల్ మరియు ఇతర హక్కుల ద్వారా కూడా భారీ రాబడి వస్తేనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ సురక్షితంగా బయటపడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆ విషయంలో గర్వపడుతున్నా!

తన సినీ ప్రయాణంలో నటన మొదలుకొని భాష, సంభాషణలు పలికే విధానం, యాస.. ఇలా ఎన్నో విషయాల్లో విమర్శలను ఎదుర్కొన్నానని, అయితే వాటి కారణంగా తాను ఏనాడు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదని రష్మిక మందన్న స్పష్టం చేసింది. విజయ్ దేవరకొండతో కలిసి ఇటీవల 'కాఫీ విత్ కరణ్' సీజన్ 9లో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ముఖ్యంగా హిందీ మాట్లాడే విధానం, దక్షిణాదియాసపై వస్తున్న విమర్శలకు గట్టిగా సమాధానమిచ్చింది. 'నేను దక్షిణాది అమ్మాయిని. నా మాటల్లో ప్రాంతీయ యాస కనిపించడం సహజం. దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దు. నేను నటించే ప్రతి సినిమాకు డబ్బింగ్ ఆర్టిస్టులతో సంభాషణలు చెప్పించుకునే అవకాశం ఉంటుంది. కానీ నేనే డబ్బింగ్ చెప్పాలని చాలా మంది దర్శకులు కోరుతున్నారు. భిన్న భాషల్లో సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పడం సవాలుతో కూడుకున్న పని. అన్ని భాషల్లో సొంతంగా డబ్బింగ్ చెప్పడం ఎంతో గర్వంగా భావిస్తున్నా' అని రష్మిక మందన్న పేర్కొన్నది.




# ప్రభాస్ పుట్టినరోజు స్పెషల్..
## -'కల్కి 2' నుంచి అదిరిపోయే అప్‌డేట్, మళ్లీ భైరవగా డార్లింగ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందనున్న 'కల్కి 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందా? ప్రభాస్ మళ్లీ ఎప్పుడు సెట్స్‌లోకి అడుగుపెడతాడా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది.'కల్కి 2'కు సంబంధించిన తాజా వీడియోలో ప్రభాస్‌ను మరోసారి భైరవ పాత్రలో చూపించే కొన్ని దృశ్యాలను చిత్రబృందం పంచుకుంది. దీంతో ఈ సినిమా గురించి ఎదురుచూస్తున్న అభిమానులకు కొత్త ఉత్సాహం వచ్చింది.మొదటి భాగంలో భైరవ పాత్రలో ప్రభాస్ చూపించిన విన్యాసాలు, తెరపై ఆయన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు రెండో భాగంలో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి మరింత పెరిగింది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ వీడియో సినిమా నిర్మాణంపై అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే ఈ వీడియోతోనే చిత్రీకరణ ప్రారంభ తేదీ ఖరారైనట్లు భావించకూడదు. షూటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తొలి భాగంలో కనిపించిన అద్భుతమైన ప్రపంచాన్ని మరింత విస్తరించేలా రెండో భాగాన్ని రూపొందించనున్నారనే అంచనాలు ఉన్నాయి. ప్రభాస్‌తో పాటు సాయిపల్లవి, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ వంటి ప్రముఖ నటీనటులు ఈ ప్రాజెక్టుతో సంబంధం కలిగి ఉన్నారు. సంగీతాన్ని సంతోష్ నారాయణన్ అందిస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ' తొలి భాగం విజయంతో రెండో భాగంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. కథలోని కీలక మలుపులు, ప్రధాన పాత్రల మధ్య సంబంధాలు, భవిష్యత్తు ప్రపంచం నేపథ్యంలో సాగే సంఘటనలు రెండో భాగంలో ఎలా ఉండబోతున్నాయనే విషయంపై అభిమానులు చర్చించుకుంటున్నారు.

# వెంకటేష్ 'ఆదర్శ కుటుంబం' ఎఫెక్ట్..
## విడుదల తేదీలు మార్చుకున్న చిన్న సినిమాలు!




టాలీవుడ్‌లో సినిమాల విడుదల తేదీల మార్పులు బాక్సాఫీస్ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47' చిత్రం అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించిన చిత్ర బృందం, ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేసింది. తాజాగా మరోసారి తేదీని మార్చి అక్టోబర్ 30న విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మార్పుతో అదే రోజున విడుదల కావాల్సిన కొన్ని చిన్న సినిమాలు తమ ప్రణాళికలను మార్చుకున్నాయి.వెంకటేష్ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రావాలని భావించిన 'ఇట్లు అర్జున', 'సమ్మర్ హాలిడేస్' చిత్ర బృందాలు వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఈ రెండు సినిమాలను నవంబర్ 6న విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. పెద్ద హీరో సినిమా విడుదలైనప్పుడు థియేటర్ల కేటాయింపు, ప్రారంభ వసూళ్ల విషయంలో చిన్న చిత్రాలకు పోటీ ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే ఒక వారం ఆలస్యంగా విడుదల చేస్తే థియేటర్లు అందుబాటులోకి రావడంతో పాటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు మెరుగైన అవకాశం లభిస్తుందని ఆయా చిత్రాల నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం.మరోవైపు, అక్టోబర్ 30న విడుదల చేయాలని భావించిన 'చంద్రయాన్', 'ఏమో ఏమో ఇది' చిత్రాల విడుదల ప్రణాళికల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ రెండు సినిమాల కొత్త విడుదల తేదీలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. చిత్ర బృందాలు త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. టాలీవుడ్‌లో పెద్ద సినిమాల విడుదల తేదీలు ఖరారైనప్పుడు, అదే సమయంలో విడుదలకు సిద్ధమవుతున్న చిన్న చిత్రాల నిర్మాతలు తమ ప్రణాళికలను మరోసారి పరిశీలించడం సాధారణమే. థియేటర్ల సమస్య, ప్రేక్షకుల ఆదరణ, ప్రారంభ వసూళ్లు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని విడుదల తేదీలను మార్చుకుంటుంటారు. ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47' అక్టోబర్ 30న విడుదల కానుండటంతో ఆ తేదీ చుట్టూ బాక్సాఫీస్ పోటీపై ఆసక్తి నెలకొంది. 'ఇట్లు అర్జున', 'సమ్మర్ హాలిడేస్' నవంబర్ 6కి వెళ్లగా, 'చంద్రయాన్', 'ఏమో ఏమో ఇది' కొత్త తేదీల కోసం ఎదురుచూస్తున్నాయి. అయితే ఈ విడుదల తేదీలకు సంబంధించిన తుది వివరాలు ఆయా చిత్ర బృందాల అధికారిక ప్రకటనలతో స్పష్టమవుతాయి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831